


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 9 సంచిక : 192 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | బుధవారం 18 మార్చి 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE : 192 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | WED 18 MARCH 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## పనిచేసే సామర్థ్యం ఉన్నా దేశంలో 40% పట్టభద్రులకు ఉద్యోగాలు లేవు

- దేశంలో నిరుద్యోగ సమస్యపై కీలక నివేదిక రిలీజ్
- పట్టభద్రులు చదువు పూర్తైన వెంటనే ఉద్యోగం పొందలేకపోతున్నారని వెల్లడి
- "గత కొన్ని దశాబ్దాలుగా దేశంలో యువ జనాభా సంఖ్య గణనీయంగా పెరిగింది.

మిగతా2లో



## జగన్‌కు ధైర్యం ఉంటే సీఈసీపై పెట్టే అభిశంసనకు మద్దతివ్వాలి



- విజయనగరం జిల్లా జామిలో పర్యటించిన ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- అభిశంసనకు మద్దతు ఇస్తున్నట్లు వైఎస్సార్సీపీ ఎంపీలు సంతకాలు పెట్టాలని డిమాండ్
- రాష్ట్రంలో ఈవీఎంలు మారిపోయాయని ఎన్నికల్లో ఓటమి తర్వాత జగన్ బీద ఏడుపులు ఏడ్చారు

పెన్ పవర్ డెస్క్:జగన్‌కు ధైర్యం ఉంటే కేంద్ర ఎన్నికల ప్రధాన అధికా రిపై పార్లమెంటులో పెట్టే అభిశంసనకు మద్దతివ్వాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. అలానే మద్దతు ఇస్తున్నట్లు వైఎస్సార్సీపీ ఎంపీలు సం తకాలు పెట్టాలని అన్నారు. విజయనగరం జిల్లా పర్య టించిన షర్మిల జామి గ్రామంలో నిర్వహించిన రచ్చ బండ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ రాష్ట్రంలో ఈవీఎంలు మారిపోయాయని దొంగ ఏడుపులు, నా అక్కచెల్లెమ్మల ఓట్లు ఎక్కడ పోయాయో అని బీద ఏడుపులు ఏడ్చారు కదా అని అన్నారు. అవసరమైనచోట దొంగ ఓట్లు, అవసరం లేనిచోట ఓట్లు తొలగిస్తున్నారని మండిపడ్డారు. - మిగతా2లో



## ఇంధన కొరతపై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు

- పశ్చిమాసియా సంక్షోభం ముగింపునకు చర్చలు, దౌత్యమే మార్గం: భారత్
- ఈయూ మంత్రుల సమావేశంలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రస్తావించారని చెప్పిన అధికార ప్రతినిధి
- దేశంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయి
- ఎక్కడా కొరత లేదని కేంద్ర స్పష్టం

మిగతా2లో

# ఏసీబీ ట్రాప్‌లో సర్వేయర్

## తాడేపల్లిగూడెంలో అవినీతి బహిర్గతం

- రూ.50 వేల లంచం డిమాండ్ చేసిన సర్వేయర్
- ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ రామకృష్ణ
- ఇంటి, కార్యాలయాల్లో విస్తృత సోదాలు
- సర్వే సిబ్బంది, కుటుంబ సభ్యుల విచారణ
- ఇంచార్జి డివిజనల్ సర్వేయర్‌గా అదనపు బాధ్యతలు
- గతం నుంచే అవినీతి ఆరోపణల మబ్బులు
- ఏసీబీ దాడులతో మున్సిపల్ కార్యాలయంలో కలకలం
- అధికారుల సమక్షంలో ఆపరేషన్ విజయవంతం
- "నోటు కొట్టు - పత్రం పట్టు" వ్యవస్థపై విమర్శలు









పెన్ పవర్, తాడేపల్లిగూడెం, మార్చి 17:తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో అవినీతి మరోసారి బట్టబయలైంది. సర్వే రిపోర్ట్ కోసం రూ.50 వేల లంచం డిమాండ్ చేసిన సర్వేయర్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం స్థానికంగా సంచలనం సృష్టించింది.

మిగతా2లో

## రైల్వే శాఖపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఫైర్

- పరీక్షను కన్నడలో నిర్వహించాలని వేలాది మంది ఉద్యోగులు, పలు సంస్థలు శాంతియుతంగా విజ్ఞప్తి చేసినప్పటికీ రైల్వే శాఖ పట్టించుకోలేదు
- ఈ ఆకస్మిక నిర్ణయంతో కన్నడ ఉద్యోగులు తీవ్ర గందరగోళానికి, అనిశ్చితికి గురయ్యారు



మిగతా2లో



## పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలి

- కాబుల్ దాడిని ఖండించిన భారత్
- మారణహోమాన్ని సైనిక ఆపరేషన్‌గా చెప్పుకునేందుకు పాకిస్థాన్ యత్నిస్తోందని భారత విదేశాంగ శాఖ విమర్శ
- పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలని డిమాండ్

మిగతా2లో

## 'ఆ నిబంధన సరికాదు'

- ప్రసూతి సెలవులపై సుప్రీంకోర్టు కీలక తీర్పు
- దత్తత తీసుకున్న బిడ్డ వయసు మూడు నెలల కంటే ఎక్కువగా ఉంటే ప్రసూతి సెలవులను నిరాకరించడం సరికాదని సుప్రీం వ్యాఖ్య
- పితృత్వ సెలవులను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్రానికి సుప్రీం కోర్టు సూచన

2



## వైసీపీకి 'గుండె ధైర్యం' అనేది ఒక ట్రేడ్ మార్క్



- జగన్ చేయగలిగింది బాబు ఎందుకు చేయలేకపోతున్నాడనే చర్చ జరుగుతోంది: జగన్
- విలువలు, విశ్వసనీయతే పార్టీకి పునాదులు
- అమరావతి పనుల్లో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోంది
- రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం రావడం లేదు

పెన్ పవర్ డెస్క్:తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నేడు ఒంగోలు నియోజకవర్గ కేడర్‌తో భేటీ అయిన వైసీపీ అధినేత జగన్... కూటమి ప్రభుత్వంపై తన విమర్శనాస్త్రాలకు మరింత పదును పెట్టారు. వైసీపీకి 'గుండె ధైర్యం' అనేది ఒక ట్రేడ్ మార్క్ అని... విలువలు, విశ్వసనీయతే పార్టీకి పునాదులని ఆయన అన్నారు. తమ ఐదేళ్ల పాలనకు, ప్రస్తుత చంద్రబాబు పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలు ఇప్పటికే గమనిస్తున్నారని జగన్ పేర్కొన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు కోవిడ్ వంటి కష్టాలు ఎదురైనా, ఆర్థిక ఒత్తిళ్ల మధ్య కూడా ఇచ్చిన మాట తప్పకుండా సంక్షేమ పథకాలను క్యాలెండర్ ప్రకారం అమలు చేశామని గుర్తు చేశారు. సుమారు రూ. 2.7 లక్షల కోట్లను నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి -

మిగతా2లో



## 291 మంది అభ్యర్థులతో టీఎంసీ జాబితా

- భవానీపుర్ బరిలో మమత-సువేందుతో మళ్లీ ఢీ
- ఎన్నికల్లో పోటీచేయాలని అనుకుంటే, వంటగ్యాస్ సంక్షోభాన్ని సృష్టించొద్దు
- జనంలోకి వెళ్లేందుకు బీజేపీ భయపడుతోంది
- అభ్యర్థుల జాబితా విడుదల వేళ సీఎం మమత వ్యాఖ్యలు

మిగతా2లో

## 20 లక్షల ఉద్యోగాల కల్పనే సింగిల్ అజెండా

- పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా కృషి
- మంగళగిరిలోని మయూరి టెక్ పార్క్ భవనంలో ఏపీఈడీబీ నూతన కార్యాలయం ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్
- దేశానికి వచ్చిన వంద రూపాయల పెట్టుబడుల్లో 25 రూపాయలు ఏపీకి వచ్చాయని వెల్లడి
- గత ప్రభుత్వం ఏపీఈడీబీని నిర్లక్ష్యం చేసింది
- దేశానికి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయి




పెన్ పవర్ డెస్క్:దేశానికి వచ్చిన వంద రూపాయల పెట్టుబడుల్లో 25 రూపాయలు ఏపీకే వచ్చాయని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఒప్పందాలతో పాటు పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా కృషి చేయాలని సూచిం చారు. ఈ నెల 23వ తేదీన రెండో స్టీల్ సిటీకి శంకుస్థాపన చేస్తున్నా మని తెలిపారు. ఇంతటితో తృప్తి పడకుండా ఎందుకు 5 స్టీల్ సిటీలు నిర్మించకూడదనే లక్ష్యంతో పని చేయాలని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం ఏపీఈడీబీని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే సింగిల్ అజెండాగా

- మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

### పనిచేసే సామర్థ్యం ఉన్నా దేశంలో 40% పట్టభద్రులకు ఉద్యోగాలు లేవు

దేశంలో నిరుద్యోగంపై కీలక నివేదిక వెలువడింది. భారత్‌లో 20-29 ఏళ్ల మధ్య వయసున్న 63 మిలియన్ల మంది పట్టభద్రుల్లో 11 మిలియన్ల మంది నిరుద్యోగులుగా ఉన్నట్లు తేలింది. ఈ పట్టభద్రుల్లో ఏడు శాతం మందే గ్రాడ్యుయేషన్ పూర్తైన ఏడాదిలోపు స్థిరమైన జీతంతో కూడిన ఉద్యోగాలు పొందుతున్నట్లు వెల్లడైంది. ఈ మేరకు అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా' పేరిట తాజాగా నివేదిక విడుదల చేసింది.

**'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా' నివేదిక ప్రకారం**

పట్టభద్రుల్లో నిరుద్యోగం అధికంగానే ఉంది. 15-25 ఏళ్ల మధ్య వయసు వారిలో దాదాపు 40 శాతం, 25- 29 ఏళ్ల మధ్య వయసు వారిలో 20 శాతంగా నిరుద్యోగం ఉంది. తమ గ్రాడ్యుయేషన్ పూర్తైన ఏడాదిలోపు అతి కొద్ది మంది మాత్రమే స్థిరమైన జీతంతో కూడిన ఉద్యోగాలు పొందుతున్నారు. ఇటీవలి సంవత్సరాలలో పట్టభద్రుల జనాభా పెరగడం వల్ల నిరుద్యోగ సమస్య మరింత తీవ్రమైంది.

**'పట్టభద్రుల సంఖ్య పెరిగింది'**

"గత కొన్ని దశాబ్దాలుగా దేశంలో యువ జనాభా సంఖ్య గణనీయంగా పెరిగింది. అలాగే ఉన్నత విద్యనభ్యసించేవారి సంఖ్య కూడా పెరిగింది. దీంతో యువ పట్టభద్రుల సంఖ్యలో కూడా పెరుగుదల కనిపించింది. 2023 నాటికి 20- 29 ఏళ్ల మధ్య వయసు ఉన్న 63 మిలియన్ల పట్టభద్రుల్లో 11 మిలియన్ల మంది నిరుద్యోగులుగా ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి విద్యా అంతరాలను పూడ్చడంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించింది. ఉన్నత విద్యలో మొత్తం నమోదు నిష్పత్తులు దేశ అభివృద్ధి స్థాయికి అనుగుణంగా ఉన్నాయి. లింగ, కుల ప్రాతిపదికన విద్యను పొందడంలో ఉన్న సామాజిక, ఆర్థిక అడ్డంకులు తగ్గాయి. దాని ఫలితంగా భారత్‌లో కార్మిక మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్న శ్రామిక శక్తి మరింత సమర్థవంతంగా ఉంది" అని స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా నివేదికలో పేర్కొంది.

### పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలి

అఫ్గానిస్థాన్‌లోని ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. సైనిక స్థావరంగా ఏమాత్రం సమర్థించుకోలేని ఆస్పత్రిపై దాడి చేసి, పెద్ద సంఖ్యలో పౌరుల ప్రాణాలను బలిగొనడం అత్యంత పిరికిపంద, అమానవీయ చర్య అని మండిపడింది. ఈ మారణహోమాన్ని సైనిక ఆపరేషన్‌గా చెప్పుకునేందుకు పాకిస్థాన్ యత్నిస్తోందని భారత విదేశాంగ శాఖ విమర్శించింది. ఈ హేయమైన చర్య ప్రాంతీయ శాంతిభద్రతలకు ప్రత్యక్ష ముప్పని పేర్కొంది.

అంతర్గత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సరిహద్దు వెలుపల హింసకు పాల్పడటం పాక్ బరితెగింపు ధోరణికి అద్దంపట్టిందని ధ్వజమెత్తింది. ఆస్పత్రిని ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకోవడాన్ని ఏ మతం, ఏ చట్టం, ఏ నైతికత సమర్థించలేదని స్పష్టం చేసింది. పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలని, అఫ్గాన్ పౌరులపై ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దాడులను తక్షణమే అడ్డుకోవాలని భారత్ పిలుపునిచ్చింది. ఈ విషాద సమయంలో అఫ్గాన్లకు అండగా ఉంటామని భరోసా ఇచ్చింది. రంజాన్ వేళ ఇలాంటి దాడులకు పాల్పడటం దారుణమని విచారం వ్యక్తంచేస్తూ భారత విదేశాంగ శాఖ ప్రకటనను విడుదల చేసింది. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు శాంతి, ఆత్మపరిశీలన, కరుణతో గడిపే పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడి జరగడం దారుణం. ఒక ఆసుపత్రిని అందులోని రోగులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఏ మతమూ, ఏ చట్టమూ, ఏ నైతికతా సమర్థించలేవు. ఈ నేరపూరిత చర్యకు పాల్పడిన వారిని జవాబుదారీగా చేయాలి. ఆఫ్గానిస్థాన్‌లో పౌరులపై పాకిస్థాన్ చేస్తున్న విచక్షణారహిత దాడులను వెంటనే ఆపేలా అంతర్జాతీయ సమాజం కృషి చేయాలి. మృతుల కుటుంబాలకు భారత్? తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుంది. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తుంది. ఈ విషాద సమయంలో ఆఫ్గానిస్థాన్ ప్రజలకు భారత్? సంఘీభావంగా నిలుస్తుంది. ఆఫ్గానిస్థాన్ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతకు మా పూర్తి మద్దతును ఇస్తున్నాం."

**ఐక్యరాజ్య సమితి వేదికపై పాక్‌కు భారత్ కౌంటర్?**

పవిత్ర రంజాన్ మాసంలో అఫ్గానిస్థాన్‌లోని ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడులను ఐక్యరాజ్య సమితి వేదికపై భారత్? తీవ్రంగా ఖండించింది. అలాగే అఫ్గాన్ జాతీయులను తరలించడంపైనా భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని పాక్ తీరును ఎండగట్టారు. ఐక్యరాజ్యసమితి నిర్వహించిన ఇస్లామోఫోబియాను ఎదుర్కొనే అంతర్జాతీయ దినోత్సవ కార్యక్రమంలో ఆయన వ్యాఖ్యలు చేశారు.

### 'ఆ నిబంధన సరికాదు'

చిన్నారులను దత్తత తీసుకునే మహిళలకు సంబంధించి ప్రసూతి సెలవుల విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. దత్తత తీసుకున్న బిడ్డ వయసు మూడు నెలల కంటే తక్కువ ఉంటేనే ప్రసూతి సెలవులకు అర్హత అనే నిబంధన సరికాదని, దీనికి అనుమతించే సోషల్ సెక్యూరిటీ కోడ్ 2020లోని సెక్షన్ 60(4) రాజ్యాంగ విరుద్ధమని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. చిన్నారి వయసుతో సంబంధం లేకుండా దత్తత తీసుకున్న సమయం నుంచి 12 వారాల పాటు ప్రసూతి సెలవులు తీసుకునేందుకు అర్హత ఉంటుందని తెలిపింది. దత్తత వంటి మార్గాల్లో కుటుంబాన్ని ఏర్పాటు చేసుకోవడం చట్టబద్ధమేనని స్పష్టం చేసింది. దత్తత తీసుకున్న బిడ్డకు కన్న బిడ్డకు మధ్య ఎలాంటి వ్యత్యాసం ఉండదని, ప్రసూతి సంరక్షణ కనీస హక్కు అని జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. నండూరి హంసనందిని అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్?పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ మేరకు తీర్పును ఇచ్చింది. ఈ క్రమంలోనే సామాజిక భద్రత చర్యగా పితృత్వ సెలవులను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్రాన్ని సుప్రీం కోర్టు సూచించింది.

అయితే, 1961 నాటి మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ ప్రకారం 3 నెలల కంటే తక్కువ వయసు ఉన్న బిడ్డను దత్తత తీసుకునే మహిళా ఉద్యోగులు 12 వారాలు (మూడు నెలలు) వేతనంతో కూడిన ప్రసూతి సెలవు తీసుకోవడానికి అర్హత ఉంది. ఇంకా ఈ చట్టం ప్రకారం అర్హులైన మహిళలకు 26 వారాలు వేతనంతో కూడిన సెలవుకు హక్కు కల్పిస్తుంది. ఇది ప్రభుత్వ లేదా ప్రైవేట్ రంగంలోని అన్ని కార్యాలయాలకు వర్తిస్తుంది. పితృత్వ సెలవుపై ప్రైవేట్ రంగానికి సంబంధించి ఎలాంటి చట్టం లేకపోయినా, ప్రభుత్వ ఉద్యోగులకు 15 రోజుల వేతనంతో కూడిన పితృత్వ సెలవుకు అర్హత ఉంది. ఒకవేళ ప్రైవేట్ రంగ ఉద్యోగులు ఈ ప్రయోజనాన్ని పొందడానికి సరైన నిబంధనలు లేవు.

### రైల్వే శాఖపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఫైర్

రైల్వే ఉద్యోగుల ప్రమోషన్ పరీక్షలను చివరి నిమిషంలో రద్దు చేయడంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రైల్వే శాఖపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. పరీక్షలను కన్నడ భాషలో రాసేందుకు అవకాశం కల్పించకపోవడంతో కన్నడ సంఘాలు నిరసన చేపట్టాయి. దీంతో రైల్వే శాఖ హఠాత్తుగా పరీక్షలను రద్దు చేసింది. ఈ చర్యను సిద్ధరామయ్య తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో, నైరుతి రైల్వే పరిధిలో 194 గూడ్స్ ట్రైన్ మేనేజర్ పోస్టులు, హుబ్బళ్లి డివిజన్‌లో 101 ఎల్‌డీసీఈ పోస్టుల ప్రమోషన్ల కోసం జరగాల్సిన పరీక్షలను చివరి నిమిషంలో రద్దు చేశారని తెలిపారు. ఈ ఆకస్మిక నిర్ణయంతో కన్నడ ఉద్యోగులు తీవ్ర గందరగోళానికి, అనిశ్చితికి గురయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షను కన్నడలో నిర్వహించాలని వేలాది మంది ఉద్యోగులు, పలు సంస్థలు శాంతియుతంగా విజ్ఞప్తి చేసినప్పటికీ రైల్వే శాఖ పట్టించుకోలేదని సిద్ధరామయ్య ఆరోపించారు. నిరసనలు ఉధృతమయ్యాక హడావుడిగా పరీక్షను రద్దు చేయడం ఖండనీయమని పేర్కొన్నారు. "మొదట్లోనే ఈ సమస్యను గుర్తించి, కన్నడలో పరీక్షకు అనుమతి ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. రైల్వే శాఖ కన్నడ వ్యతిరేక వైఖరి అవలంబిస్తోంది," అని ఆయన విమర్శించారు. కర్ణాటకకు చెందిన వి. సోమన్న రైల్వే శాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పటికీ ఇలాంటి పరిస్థితి రావడం అత్యంత దురదృష్టకరమని సిద్ధరామయ్య అన్నారు.

# ఏసీబీ ట్రాప్‌లో సర్వేయర్









- మొదటి పేజి తరువాయి

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో అవినీతి వ్యవహారం వెలుగులోకి రావడంతో స్థానికంగా కలకలం రేగింది. మున్సిపల్ సర్వేయర్‌గా పనిచేస్తున్న రౌతు రామకృష్ణ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కడం ఈ వ్యవహారానికి కేంద్రబిందువైంది.

ఒక స్థలానికి సంబంధించిన సర్వే రిపోర్ట్ ఇవ్వడానికి ఆ స్థల యజమాని వద్ద రూ.50 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కడకట్లకు చెందిన సిరంగి ఎడ్వర్డ్ కెనడీ ఈ విషయంపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు ప్రణాళికాబద్ధంగా ట్రాప్ నిర్వహించారు. ఫిర్యాదుదారుడు నగదు అందజేస్తుండగా రామకృష్ణను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో అవినీతి వ్యవహారం బహిర్గతమైంది.

ఈ ఘటన అనంతరం ఏసీబీ అధికారులు సర్వేయర్ రామకృష్ణ నివాసంతో పాటు మున్సిపల్ కార్యాలయంలో విస్తృతంగా సోదాలు చేపట్టారు. అతని ఛాంబర్‌లో ఉన్న ఫైళ్లను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బంది, కార్యాలయానికి సంబంధించిన ఇతర సిబ్బంది, కుటుంబ సభ్యులను కూడా అధికారులు విచారిస్తున్నారు. రామకృష్ణ మున్సిపల్ సర్వేయర్‌గా పనిచేయడంతో పాటు ఇంచార్జి డివిజనల్ సర్వేయర్ బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నట్లు తెలిసింది. స్థానికంగా రామకృష్ణపై గతం నుంచే అవినీతి ఆరోపణలు ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు. ఈ ట్రాప్‌తో అవి మరింత స్పష్టమయ్యాయని భావిస్తున్నారు. ఏసీబీ దాడులతో తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో ఒక్కసారిగా ఉలిక్కిపాటు నెలకొంది.

ఈ దాడులను ఏసీబీ డీఎస్పీ జీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో ఇన్స్పెక్టర్లు ఎం. బాలకృష్ణ, కే. శ్రీనివాస్ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో పై అధికారుల నుంచి కింది సిబ్బంది వరకు లంచాల వ్యవహారం కొనసాగుతోందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

ఈ ఘటన నేపథ్యంలో "నోటు కొట్టు -- పత్రం పట్టు" అన్న వ్యవస్థ మున్సిపల్ కార్యాలయాల్లో స్థిరపడిపోయిందనే విమర్శలు మరింత బలపడుతున్నాయి. ప్రజలకు సేవలు అందించాల్సిన కార్యాలయాల్లో అవినీతి వేళ్లూనుకుపోయిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ విస్తరణే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

తాజాగా విశాఖలో అదనపు స్టాక్ చేరడంతో సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని సీఎం భరోసా ఇచ్చారు. ఈకేవైసీ, ఓటీపీల సాయంతో గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పంపిణీ జరిగేలా చూడాలన్నారు. గ్యాస్ సిలిండర్ల డెలివరీ సమయాన్ని ప్రస్తుతం ఉన్న దానికంటే తగ్గించి, కేవలం 1.5 రోజుల్లో వినియోగదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆస్పత్రులు, హాస్టళ్లు, దేవాలయాలకు గ్యాస్ కొరత రాకుండా చూడాలని, ప్రత్యామ్నాయంగా ఇండక్షన్ స్టవ్‌ల లభ్యతను కూడా పరిశీలించాలని సూచించారు.

**పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ విస్తరణే లక్ష్యం**

ఎల్పీజీ సరఫరాను పర్యవేక్షిస్తూనే, దీనికి శాశ్వత ప్రత్యామ్నాయంపై ముఖ్యమంత్రి దృష్టి సారించారు. రాష్ట్రంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) నెట్వర్క్‌ను మరింతగా విస్తరించడం ద్వారా ప్రజలపై భారం తగ్గించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఏపీలో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును పైప్డ్ నెట్వర్క్ ద్వారా ప్రజల ఇళ్లకు చేర్చడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్ జీ), పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్ జీ) వినియోగాన్ని గరిష్ఠంగా పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని పేర్కొన్నారు. గతంలో ఎల్ఎన్జీని ఏపీకి కేటాయించుకుని, రెండు సీజన్లలో పైప్ లైన్ ద్వారా కొండపల్లి వరకు తీసుకురాగలిగామని సీఎం గుర్తు చేశారు. తక్కువ వ్యయంతో కూడిన ఇంధనాన్ని వినియోగదారులకు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏజీ అండ్ పీ, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్, జీజీపీఎల్, ఐఓసీఎల్, మెఘా గ్యాస్ వంటి సంస్థలు 198 సీఎన్జీ స్టేషన్ల ద్వారా గ్యాస్ సరఫరా చేస్తున్నాయని, 1.68 లక్షల గృహాలకు కనెక్షన్లు ఇచ్చే మౌలిక సదుపాయాలు ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, అమరావతితో పాటు ఇతర పట్టణ ప్రాంతాల్లో పైప్డ్ గ్యాస్ నెట్వర్క్‌ను భారీగా విస్తరించేందుకు వెంటనే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో సహకరించేలా పెట్రోలియం కంపెనీలతో మాట్లాడి, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని సూచించారు.

**'ఏపీ వన్' యాప్‌తో సత్వర సేవలు**

ఈ సమీక్షలో కేవలం ఇంధన అంశాలకే పరిమితం కాకుండా, పలు పాలనాపరమైన అంశాలపైనా సీఎం ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై వాహనదారులకు అవగాహన కల్పించాలని, వారికి సంక్షిప్త సందేశాలు పంపాలని సూచించారు. విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం రూపొందిస్తున్న 'ఏపీ వన్ యాప్'ను త్వరితగతిన అందుబాటులోకి తేవాలన్నారు. ప్రభుత్వ శాఖలు 'డేటా లేక్', 'అవేర్' వేదికలను ఏ మేరకు వినియోగించుకుంటున్నాయో గుర్తించి, వేసవిలో తాగునీరు, వడగాల్పులు, పశుగ్రాసం వంటి అంశాలపై ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మహిళలపై నేరాలు, డ్రగ్స్ నియంత్రణపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని, స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ ఉన్నతస్థాయి సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఐఅండ్ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఇతర ఉన్నతాధికారులు, గెయిల్, ఓఎన్జీసీ, వివిధ పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 291 మంది అభ్యర్థులతో టీఎంసీ జాబితా

బంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం 291 మంది అభ్యర్థుల పేర్లతో తృణమూల్ కాంగ్రెస్ (టెఎంసీ) పార్టీ జాబితాను విడుదల చేసింది. మంగళవారం మీడియా సమావేశం వేదికగా ఈ జాబితాను టీఎంసీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ విడుదల చేశారు. మిగతా మూడు సీట్లను తమ మిత్రపక్షం భారతీయ గోర్ఖా ప్రజాతాంత్రిక్ మోర్చా (బీజీపీఎం)కు ఇచ్చామని ఆమె తెలిపారు. డార్జిలింగ్, కుర్సేఓంగ్, కాలిమ్ పోంగ్ స్థానాల్లో బీజీపీఎం పోటీ చేస్తుందని వెల్లడించారు. టీఎంసీ జాబితా ప్రకారం, భవానీపుర్ అసెంబ్లీ స్థానం నుంచి మమతా బెనర్జీ పోటీ చేస్తున్నారు. అక్కడి నుంచి బీజేపీ అభ్యర్థిగా, రాష్ట్ర విపక్ష నేత సువేందు అధికారి బరిలోకి దిగారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్ స్థానంలో దీదీని సువేందు ఓడించారు. దీంతో ఈసారి నందిగ్రామ్‌తో పాటు భవానీపుర్ సీటును ఆయనకే బీజేపీ పెద్దలు కేటాయించారు.

**"ఈసీ పావులు కదిపినా బీజేపీకి ఛాన్స్ లేకుండా పోయింది"**

బీజేపీ పాలనా వైఫల్యం వల్లే భారతదేశంలో ఎల్‌పీజీ వంటగ్యాస్ సంక్షోభం ఏర్పడిందని సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఈ ఎన్నికల్లో పోటీచేయాలని అనుకుంటే, వంటగ్యాస్ సంక్షోభాన్ని సృష్టించొద్దని బీజేపీకి ఆమె సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో జనంలోకి వెళ్లేందుకు బీజేపీ భయపడుతోందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) బంగాల్‌లో చాలా తెలివిగా పావులు కదిపిందని, అయినా బీజేపీకి ఛాన్స్ లేకుండా పోయిందని మమత ఎద్దేవా చేశారు. గత ఎన్నికల కంటే ఈసారి బీజేపీ అసెంబ్లీ సీట్లు తగ్గిపోతాయన్నారు. ఇది బంగాల్ అస్తిత్వానికి సంబంధించిన ఎన్నిక అని, ఇందులో దిల్లీ లడ్డూ గెలవదని, బంగాలే గెలుస్తుందని దీదీ విశ్వాసం వెలిబుచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా తనకు ఉండే అధికారాలను, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హరిస్తోందని ఆమె తెలిపారు.

**"ఏదైనా జరిగితే, నిందలు నాపై మోపొద్దు"**

"నా సర్వ అధికారాలను కేంద్ర ప్రభుత్వం లాక్కుంది. ఒకవేళ రాష్ట్రంలో ప్రకృతి విపత్తులు వస్తే, ఎవరు బాధ్యత తీసుకోవాలి? ఒకవేళ శాంతిభద్రతల సమస్య తలెత్తితే, ఎవరు బాధ్యత తీసుకోవాలి? నా ప్రభుత్వంలోని అధికారులంతా బంగాలీలే, చివరకు వాళ్లను కూడా తొలగించారు. ఇక వినీత్ కుమార్, మురళీధర్ లాంటి బంగాలీయేతర అధికారులను సైతం లాక్కున్నారు. కేంద్ర భద్రతా బలగాలను రాష్ట్రంలో మోహరించారు. వాళ్ల బాధ్యతను ఎవరు తీసుకుంటారు? బయటి వాళ్లు బంగాల్‌లో ఉన్నారు. వాళ్ల దగ్గర డబ్బులున్నాయి. ఈ పరిస్థితుల్లో ఒకవేళ ఏదైన జరిగితే, నిందలు నాపై మోపొద్దు" అని సీఎం మమత వ్యాఖ్యానించారు.

## 20 లక్షల ఉద్యోగాల కల్పనే సింగిల్ అజెండా

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ ఏకైక లక్ష్యం కావాలని అన్నారు. మంగళగిరిలోని మయూరి టెక్ పార్క్ భవనంలో ఏర్పాటు చేసిన ఏపీ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డు నూతన కార్యాలయాన్ని మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీని ఎంచుకున్నాయన్న మంత్రి ఇప్పుడు మరింత స్పీడ్ పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. రిలయన్స్ సీబీజీ ప్రాజెక్ట్ వల్ల పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే సుమారు 22 క్లస్టర్లను గుర్తించామని వర్టికల్ ఇంటిగ్రేషన్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్?పై దృషి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్, ఏపీఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం ఏపీఈడీబీని నిర్లక్ష్యం చేసింది. దేశానికి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయి. ఒప్పందాలతో పాటు పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా కృషి చేయాలి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీని ఎంచుకున్నాయి. ఇప్పుడు మరింత స్పీడ్ పెంచాల్సిన అవసరం ఉంది. రిలయన్స్ సీబీజీ ప్రాజెక్ట్ వల్ల పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తున్నాయి. ఇప్పటికే సుమారు 22 క్లస్టర్లను గుర్తించాము. వర్టికల్ ఇంటిగ్రేషన్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్‌పై దృషి సారించాలి. ఈ నెల 23న రెండో స్టీల్ సిటీకి శంకుస్థాపన చేస్తాము.– నారా లోకేశ్, మంత్రి

### 'ఇంధన కొరతపై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు'

పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం ముగింపునకు చర్చలు, దౌత్య మార్గాల అవశ్యకతను భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రస్తావించారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ చెప్పారు. యూరోపియన్ యూనియన్? నేతల ఆహ్వానం మేరకు బ్రస్సెల్‌లో పర్యటించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. "మా విదేశాంగ మంత్రి జై శంకర్ బ్రస్సెల్స్ పర్యటనలో ఉన్నారు. ఈ క్రమంలోనే ఈయూ విదేశాంగ వ్యవహారాల కౌన్సిల్ సమావేశంలో పాల్గొనాల్సిందిగా ఈయూ ఉన్నత ప్రతినిధి, ఉపాధ్యక్షురాలు కాజా కల్లాస్ ఆయనను ఆహ్వానించారు. ఈ సమావేశంలో భారత్–ఈయూ సంబంధాలపై చర్చించడంతో పాటు ప్రపంచ సవాళ్లపై ముఖ్యంగా పశ్చిమాసియాలోని పరిస్థితిపై, ఇంధన భద్రతపై దాని ప్రభావాలతో సహా చర్చించారు. ఇందులో జైశంకర్?తో పాటు యూరోపియన్ యూనియన్‌లోని ఇతర మంత్రులు, ఈయూలోని వివిధ దేశాల విదేశాంగ మంత్రులు హాజరయ్యారు. ఈ క్రమంలోనే సంక్షోభాన్ని త్వరగా ముగింపు పలకడానికి చర్చలు, దౌత్య మార్గాలను అనుసరించాల్సిన అవసరాన్ని మంత్రులు చర్చించారు." అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ అన్నారు. అటు భారత విదేశాంగ మంత్రి జైశంకర్ రెండు రోజుల పర్యటనలో భాగంగా బ్రస్సెల్స్‌లో పర్యటించారు. బ్రస్సెల్స్‌లో పర్యటనను విజయవంతంగా ముగించానంటూ ఎక్స్? వేదికగా పోస్ట్ చేశారు. "యూరోపియన్ యూనియన్ విదేశీ వ్యవహారాల మండలి సమావేశం, ఈయూ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఈయూ కమిషన్ అధ్యక్షుడు ఉర్సులా వాన్ డెర్ లేయెన్‌లతో భేటీ, ఈయూ ఉపాధ్యక్షురాలు కాజా కల్లాస్‌తో చర్చలు జరిగాయి. ఈయూ ప్రతినిధులను కూడా కలుసుకుని పలువురితో విడివిడిగా ద్వైపాక్షిక చర్చలు జరిపాము." అని పోస్ట్ చేశారు.

### వైసీపీకి 'గుండె ధైర్యం' అనేది ఒక ట్రేడ్ మార్క్

-మొదటిపేజీ తరువాయి

చేరవేశామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే అప్పులు రూ. 3.30 లక్షల కోట్లు దాటాయని విమర్శించారు. జగన్ చేయగలిగింది బాబు ఎందుకు చేయలేకపోతున్నాడు? అనే చర్చ ఇప్పుడు ప్రతి ఇంట్లోనూ జరుగుతోందని ఆయన అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'దోచుకో.. పంచుకో.. తినుకో..' అనే విధానం సాగుతోందని, అమరావతి పనుల్లో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం రావడం లేదని, ఆర్థిక పరిస్థితి అధ్వానంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం అవినీతి కోసమే వారు అధికారంలో ఉన్నారని, ఎన్నికల హామీలను గాలికొదిలేశారని మండిపడ్డారు. ఈ భేటీలో బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వంటి ముఖ్య నేతలు పాల్గొన్నారు.

### జగన్‌కు ధైర్యం ఉంటే సీఈసీపై పెట్టే అభిశంసనకు మద్దతివ్వాలి

-మొదటిపేజీ తరువాయి

ఎన్నికల కమిషన్ రాజ్యాంగ విరుద్ధంగా పనిచేస్తోందని షర్మిల అన్నారు. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఇండియా కూటమి పెట్టే తీర్మానికి మద్దతు ప్రకటించాలని షర్మిల అన్నారు. మోదీకి దత్తపుత్రుడు కాదని నిరూపించుకోవాలని ఆరోపించారు. ఎన్నికల సంఘాన్ని ప్రధాని మోదీ తన చేతుల్లో పెట్టుకున్నారని ఎన్నికల కమిషన్ రాజ్యాంగ విరుద్ధంగా పని చేస్తోందని షర్మిల ఆరోపించారు. రాష్ట్రంలో ఈవీఎంలు మారిపోయాయని ఎన్నికల్లో ఓటమి తర్వాత జగన్ బీద ఏడుపులు ఏడ్చారు. జగన్ కు ధైర్యం ఉంటే కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారిపై పార్లమెంటులో పెట్టే అభిశంసనకు మద్దతివ్వాలి. అలానే మద్దతు ఇస్తున్నట్లు వైఎస్సార్సీపీ ఎంపీలు సంతకాలు పెట్టాలి. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఇండియా కూటమి పెట్టే తీర్మానికి మద్దతు ప్రకటించాలి. మోదీకి దత్తపుత్రుడు కాదని నిరూపించుకోవాలి. ఎన్నికల సంఘాన్ని ప్రధాని మోదీ తన చేతుల్లో పెట్టుకున్నారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగ విరుద్ధంగా పని చేస్తోంది.– వైఎస్ షర్మిల, ఏపీసీసీ అధ్యక్షురాలు శ్రీకాకుళం జిల్లాలో షర్మిల పర్యటన: అదే విధంగా నిన్న శ్రీకాకుళం జిల్లాలో షర్మిల పర్యటించారు. ఆముదాలవలస నియోజకవర్గంలోని కొర్లకోట గ్రామంలో రచ్చబండ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి జగన్ బానిసగా మారారని అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసే నివాళులు అర్పించారు. అనంతరం ప్రజల నుంచి వినతుల స్వీకరించారు. ఈ సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి జెడీ శీలం, కిల్లి కృపారాణి, శ్రీకాకుళం జిల్లా సీపీసీ అధ్యక్షులు సనపల అన్నాజీరావుతోపాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# పాడా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బీహెచ్. భవాని శంకర్ బాధ్యతల స్వీకరణ

**పిఠాపురం, పెన్ పవర్, మార్చి 17:** పిఠాపురం ప్రాంత అభివృద్ధి అథారిటీ (పాడా) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన బీహెచ్. భవాని శంకర్ మంగళవారం పిఠాపురం పాడా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కాకినాడ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పాడా చైర్మన్, జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# అమలాపురంలో వైఎస్సార్సీపీ భారీ నిరసన
## మహిళా నేతలపై దాడిని ఖండిస్తూ గర్జన






**అమలాపురం/అంబాజీపేట, మార్చి 17:** తిరుపతి గ్రాండ్ రిడ్జ్ హోటల్ వద్ద టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు రాజీనామా డిమాండ్‌తో శాంతి యుతంగా నిరసన తెలుపుతున్న వైఎస్సార్సీపీ మహిళా నేతలపై జరిగిన అమానుష దాడిని పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ దాడికి నిరసనగా పార్టీ కేంద్ర కార్యాలయ ఆదేశాల మేరకు అమలాపురం నియోజకవర్గం, బుద్ధవిహార్ వద్ద జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మహిళా నేతలపై భౌతిక దాడులకు పాల్పడటమే కాకుండా, బాధితులపైనే తప్పుడు కేసులు పెట్టడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా వైఎస్సార్సీపీ పోరాటం కొనసా గిస్తుందని స్పష్టం చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో కార్యక్రమం లో ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణ రావు, బొమ్మి ఇశ్రాయేల్ పార్లమెంటు పరిశీలకులు జక్కంపూడి విజయలక్ష్మి, రాజోలు కో–ఆర్డినేటర్ పాముల రాజేశ్వరి, రామచంద్రాపురం కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ , మాజీ ఎంపీ చింతా అనురాధ, గన్నవరం కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులు జిన్నూరి బాబీ , పార్టీ రాష్ట్ర కార్యదర్శులు

చెల్లుబోయిన శ్రీనివాసరావు, వంటెద్దు వెంకన్నాయుడు, కటకంశెట్టి ఆదిత్ లు రాష్ట్ర, జిల్లా, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు మరియు అనుబంధ విభాగాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసనను జయప్రదం చేశారు.

# క్రమ శిక్షణ, దాతృత్వం సహనానికి ప్రతీక రంజాన్ మాసం







- ఇఫ్తార్ విందు లో
- జిల్లా జాయింట్ కలెక్ట ర్ టి నిశాంతి

**అమల పురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 17:** మత సామరస్యం, ఆత్మీ యతకు ప్రతిక ఇఫ్తార్ విందని జిల్లా జాయింట్ కలెక్ట ర్ టి నిశాంతి అన్నా రు మంగళవారం స్థానిక సత్యనారాయణ గార్డెన్ నందు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారిక ఇఫ్తార్ విందు అత్యంత వైభవంగా నిర్వహించారు ముస్లిం సోదరులందరికీ నా హృదయ పూర్వక రంజాన్ శు భాకాంక్షలు. తెలిపారు పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి మరియు సహనానికి ప్రతీక అన్నారు ఇటువంటి కార్య క్రమాలు మన సమాజంలో మత సామరస్యాన్ని, సోదర భావాన్ని మరింత పటిష్టం చేస్తాయన్నారు అందరూ సుఖసంతోషా లతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనసారా కోరుకుంటున్నాన న్నారు. పవిత్రమైన రమజాన్ మాసం సందర్భంగా జిల్లా పరిపా లన ఆధ్వర్యంలో ఈ రోజు నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మీ అందరి తో కలిసి పాల్గొనడం నాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. రంజాన్ మాసం ఉపవాసం, ఆత్మ పరిశీలన, సహనం, దాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈ పవిత్ర కాలంలో ముస్లిం సోదర సోదరీమణులు ఆధ్యాత్మిక విలువలను ఆచరిస్తూ సమాజానికి మంచి సందేశాన్ని అంది స్తున్నారన్నారు. ఇఫ్తార్ విందు వంటి కార్యక్రమాలు సమాజంలో పరస్పర గౌరవం, ఐక్యత మరియు సౌభ్రాతృత్వాన్ని పెంపొం దించడంలో ముఖ్య మైన పాత్ర పోషిస్తాయన్నారు. వివిధ మతాలు, సంస్కృ తులకు చెందిన ప్రజలు ఒకే వేదికపై చేరి స్నేహభావం తో కలిసిమెలిసి ఉండటం మన భారతీయ సంస్కృతి కి గొప్ప ఉదాహరణగా ని లుస్తుందన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్ ప్రసంగిస్తూ జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం సామాజిక సమగ్రత కోసం మన మందరం కలసికట్టుగా పనిచేయడం ఎంతో అవసరం. పరస్పర సహకారం, పరస్పర గౌరవం, సానుభూ తి భావం మన సమాజాన్ని మరింత బలంగా నిలబెడ తాయన్నారు, శాంతి, సౌభ్రాతృత్వం, సమృద్ధి ప్రతి కుటుంబంలో నెలకొనాలని ఆకాంక్షిస్తు న్నాను. ఈ పవిత్ర సమ యంలో సమాజంలొ సౌభ్రాతృత్వం, ఐక్యత మరియు శాంతి మరింత బలపడాలని మనస్పూ ర్తిగా కోరుకుంటున్నాన న్నారు. ఇఫ్తార్ విందు ద్వారా అన్ని మతాల ప్రజలు కలిసి స్నేహభా వంతో ఉండాలని, మన జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అందరం కలిసి పని చేయాలని ఆకాంక్షించారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత మత సామరస్యానికి ప్రతీక అన్నారు. సిపిఓ మురళీ కృష్ణ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో పాటిం చే ఉపవాస దీక్షలను ముస్లిం సోదరులు ఎంతో భక్తి శ్రద్దలతో పాటిస్తారన్నారు. పవిత్రమైన రంజాన్ మాస ప్రార్ధనల్లో పాల్గొనడం సంతోషకరమన్నారు. జిల్లా టూరిజం అధికారి అన్వర్ మాట్లా డుతూ అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరికీ ఉండాలని ఆకాంక్షించారు. రంజాన్ మాసం మత సామరస్యానికి ప్రతికగా నిలుస్తుందన్నారు. ఇఫ్తార్ విందులతో సోదర భావం పెంపొంది. ప్రజల మధ్య ఐక్యత పెరుగుతుంద న్నారు. అల్లా ఆశీస్సులతో ప్రతి ఒక్కరు సుఖశాంతుల తో ఉండాల న్నారు.. ఎల్ డి ఎం కేశవ వర్మ మాట్లాడుతూ రంజాన్ మాసం క్రమశిక్షణ దాతృత్వం ఆధ్యాత్మిక చింతనకు ప్రతీకని, ప్రభుత్వం ముస్లిం మైనారిటీల అభివృద్ధికి, విద్యా ఉద్యోగ అవకాశాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, మైనారిటీల రక్షణకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రంజాన్ పండుగ ప్రజల మధ్య ప్రేమ, సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తుం దని, ముస్లిం మైనారిటీల అభివృద్ధికి, సంక్షేమానికి ఆర్థిక సాధికారతకు ప్రత్యేక చర్యలు ప్రభుత్వం తీసు కుందన్నారు. ఈ కార్యక్ర మంలో ముస్లిం మత పెద్దలు వికాస జిల్లా మేనేజర్ రమేష్ తది తరులు పాల్గొన్నారు



# ఆరోగ్య సమస్యలపై విద్యార్థులకు అవగాహన.
## జీవశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ.

**అమలాపురం/అంబాజీపేట, మార్చి 17:** జిల్లా విద్యాశాఖ వైద్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో అమలాపురం రూరల్ మండలం సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో మంగళవారం జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు.

ఎంపిక చేసిన 150 మంది జీవశాస్త్ర ఉపాధ్యాయులకు జీవశాస్త్రంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పాఠశాలల్లో శారీరక, మానసిక, సామాజిక పరంగా ఎదుర్కొనే సమస్యలు, వాటి పరిష్కారాలు, ప్రస్తుత పోటీ ప్రపంచంలో వారి సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు, వ్యక్తిగత పరిశుభ్రత, పర్యావరణ, సంక్రమిత వ్యాధులపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. దుర్గారావు దొర మాట్లాడుతూ ప్రతీ పాఠశాలలో అవసరానికి అనుగుణంగా ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే వైద్య శాఖ రూపొందించిన ఆరోగ్య అవగాహన పోస్టర్లను ప్రతీ పాఠశాలలో తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు.

ఆరోగ్య కార్యక్రమాల సమన్వయ కర్త సుమలత మాట్లాడుతూ విద్యార్థులు అపోహల కారణంగా అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఉపాధ్యాయుల సమయోచిత మార్గదర్శకతతో వాటిని నివారించాలని సూచించారు. ఉపాధ్యాయులు శారీరక, మానసిక ఆరోగ్యంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమన్నారు. జిల్లా సైన్స్ అధికారి జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యాశాఖ, వైద్యశాఖ సంయుక్తంగా నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతో దోహద పడతాయని తెలిపారు. ఈ శిక్షణ అనంతరం మండల స్థాయిలో ఎంపిక చేసిన రిసోర్స్ పర్సన్లు ప్రతీ సైన్స్ ఉపాధ్యాయుడికి ప్రత్యేక శిక్షణ అందిస్తారని వెల్లడించారు.

విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బి. హనుమంతరావు మాట్లాడుతూ జిల్లా వైద్యశాఖ ఎప్పుడూ విద్యార్థుల అవసరాలకు తక్షణ స్పందన చూపుతూ మంచి సహకారం అందిస్తోందని అభినందించారు. ఈ సందర్భంగా ఆరోగ్య అవగాహనపై పోస్టర్స్ ను పాఠశాలలకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో అయినవిల్లి మండల విద్యాశాఖ అధికారి ఎం. శ్రీనివాసరావు, రిసోర్స్ పర్సన్లు మేక రామలక్ష్మి, అంగాని గోపాలకృష్ణ, కె. బాలకృష్ణ, ఏ. ప్రసాద్, సులోచన, మృదుల పాల్గొన్నారు.

# వేసవి తీవ్రత విద్యార్థులకు పుచ్చకాయ, మజ్జిగ పంపిణీ



**మెర్లపాలెం, పెన్ పవర్, మార్చి 17:** వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మెర్లపాలెం నెం.3 ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుచ్చకాయ ముక్కలు, చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. చిప్పాడ మోహన్‌రావు జ్ఞాపకార్థం మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేసవికాలంలో విద్యార్థుల ఆరోగ్యం కాపాడాలనే ఉద్దేశంతో ఈ ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆనందంగా పుచ్చకాయ, మజ్జిగ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి పి.వి. ప్రసాద్‌రావు, ఎంఆర్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మర రాఘవ, ప్రధానోపాధ్యాయులు చిప్పాడ సత్యనారాయణ, ఉపాధ్యాయిని అనితాదేవి, యార్లగడ్డ జాహ్నవి పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బండారు చొరువతో మసీదు రోడ్డుకు మోక్షం

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 17;** ఆలమూరులోని మసీదు రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రంజాన్ కానుకగా ఈ రహదారి యుద్ధప్రాతిపతికపై నిర్మించారు. మసీదుకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండటంతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ముస్లిం సోదరుల కోరిక మేరకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేశారు. అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో బీటీ రోడ్డు నిర్మాణం సగంలో నిలిచిపోయింది. ఈ రోడ్డుపై అనేకసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ కాంట్రాక్టర్ పని పూర్తి చేయకపోవడంతో ఎమ్మెల్యే బండారు ఆదేశాల మేరకు మండల ఇంజనీరింగ్ అధికారి వీరభద్రరావు చొరవతో యుద్ధ ప్రాతిపదికపై బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి రంజాన్ కానుకగా ముస్లిం సోదరులకు రోడ్డును తయారు చేశారు. ఈ రోడ్డు నిర్మాణంతో ముస్లిం సోదరులకు ఎంతో మేలు జరుగుతుందని అలాగే గ్రామస్తులకు ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆలమూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఈదల సత్తిబాబు, ఏఎంసి మాజీ చైర్మన్ ఈదల నల్లబాబు అన్నారు. ఈ రోడ్డు నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ వహించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మండల ఇంజనీరింగ్ అధికారి వీరభద్ర రావులకు కృతజ్ఞతలు తెలిపారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కటకంశెట్టి కి నాయకులు అభినందనలు



**అమలాపురం/అంబాజీపేట, పన్ పవర్, మార్చి 17:** అమలాపురం పరిశీలకులుగా నూతనంగా నియమితులైన కటకంశెట్టి ఆదిత్య ని జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ లు భట్నవిల్లి లో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ఇంటి వద్ద అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి , రామచంద్రాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ,రాజోలు నియోజకవర్గ కో ఆర్డినేటర్ పాముల రాజేశ్వరి, రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# అమలాపురంలో జనసేన సభ్యత్వ నమోదు.




**అమలాపురం/ అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 17:** అమలాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం మంగళవారం ఉత్సాహంగా జరిగింది. సభ్యత్వ నమోదుకు చివరి రోజు కావడంతో కార్యకర్తలు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సూదా చిన్నా మహాదశ నాగేశ్వరరావు, కానిపూడి రమేష్ లు సాధకులుగా వ్యవహరించారు. ఈ శిబిరంలో నల్లా శ్రీధర్, ఏడిద శ్రీను, పడాల బాబు, గొర్తి పవన్, అడ్డాల కిట్టు, విప్పర్తి అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

## అవయవదానం ఎనిమిది ప్రాణాలకు నూతన జీవం




**కాజులూరు, పెన్ పవర్,మార్చి 17:**అవయవదానం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు కమ్యూనిటీ పారామెడిక్స్ & ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పి.ఎం.పి అసోసియేషన్) కాజులూరుకరప మండల యూనిట్ ఆధ్వర్యంలో గొల్లపాలెం పి.ఎం.పి భవనంలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు జె.వి.వి సూర్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. కాకినాడ మెడికవర్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ ప్రదీప్ భాస్కర్ (రేడియేషన్ ఆంకాలజిస్ట్),డాక్టర్ డి.కృష్ణ హాస్కర్ (న్యూరో ఫిజీషియన్),డాక్టర్ గిరిజ కళ్యాణి (ఎండోక్రనాలజిస్ట్) పాల్గొని అవయవదానం పై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ డి. కృష్ణ హాస్కర్ మాట్లాడుతూ అన్ని దానాలలో అవయవదానం అత్యంత గొప్పదని, ఒక దాత ఎనిమిది మంది ప్రాణాలను కాపాడగలడని తెలిపారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి గుండె, ఊపిరితిత్తులు,లివర్ వంటి అవయవాలను ఆరు గంటల్లోపు గ్రీన్ ఛానల్ ద్వారా మార్పిడి చేయాల్సి ఉంటుందని, కిడ్నీలను 24 గంటల్లోపు అమర్చవచ్చని వివరించారు. 18 సంవత్సరాల లోపు వారు తల్లిదండ్రుల అనుమతితో,18 సంవత్సరాలు పైబడిన వారు స్వయంగా జీవన్ దాన్ యాప్ ద్వారా అవయవదానం కోసం నమోదు చేసుకోవచ్చని సూచించారు. 100 గంటలు మాత్రమే జీవించిన శిశువు నుంచి కూడా అవయవదానం సాధ్యమని,100 సంవత్సరాలు పూర్తయిన వారి కార్నియాలను కూడా దానం చేయవచ్చని తెలిపారు. దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి అవయవాలు పరిమితంగా ఉపయోగపడవచ్చని, అలాగే మెడికల్ కాలేజీలకు బాడీ దానం చేయడం ద్వారా వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి.ఎం.పి రాష్ట్ర గౌరవ సలహాదారు కోన చిన్నారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తానీషా, జిల్లా సహాయ కార్యదర్శి కె. శ్రీనివాసరావు, ఎస్. రాంబాబు, మండల కార్యదర్శి ఆర్. వినాయక కుమార్, కోశాధికారి పి.ఎల్. శ్రీనుబాబు,సీనియర్ నాయకులు కె.ఎస్.ఎన్.బాబు,కె.ఎస్.ఆచార్యులు, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# సేవలే నిలిచే చిరస్మృతి

* ఐదేళ్ల సేవలకు ఘన వీడ్కోలు





**రామచంద్రపురం, పెన్ పవర్,మార్చి 17:**ప్రజలకు, సమాజానికి చేసిన సేవలే చిరకాలం నిలిచిపోతాయని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. రామచంద్రపురం మున్సిపాలిటీ కౌన్సిల్ పదవీకాలం మంగళవారంతో ముగిసిన సందర్భంగా చివరి అత్యవసర సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో గత ఐదేళ్ల అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించి, పట్టణ అభివృద్ధికి కౌన్సిల్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం జరిగిన సత్కార కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొని కౌన్సిల్ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టు కుంటూ ఐదేళ్లపాటు కృషి చేసిన చైర్‌పర్సన్, కౌన్సిలర్లు అభినందనీయులని అన్నారు. పదవిలో ఉన్న కాలం కంటే ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకోవడమే గొప్ప గౌరవమని పేర్కొన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నాయకత్వంలో మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా ముందుకు సాగిందని, అధికారులు–ప్రజాప్రతినిధుల సమన్వయంతో పట్టణానికి కొత్త దిశ ఏర్పడిందని కొనియాడారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించారని ప్రశంసించారు. జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ మంత్రి సుభాష్ నాయకత్వంలో రామచంద్రపురం నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమంలో ముందంజలో ఉందన్నారు. పదవీకాలం విజయవంతంగా పూర్తి చేసిన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఘన వీడ్కోలు పలికారు. అనంతరం సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవితో పాటు అన్ని వార్డుల కౌన్సిలర్లను జ్ఞాపికలు, దుశ్శాలు వాలతో సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.రాజు,డి.శ్రీకాంత్ తదితరులు కూడా ప్రజాప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా 429 మంది గైర్హాజరు

**కాకినాడ, పెన్ పవర్ మార్చి 17:**కాకినాడ జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్2026లో భాగంగా డే19 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అంతరాయాలు లేకుండా సక్రమంగా నిర్వహించబడినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వి. కేశవ రావు తెలిపారు. ఈ రోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు కెమిస్ట్రీ× పరీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 17,104 మంది విద్యార్థులు కేటాయించబడగా, 16,675 మంది హాజరై పరీక్ష రాశారని, 429 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పరీక్షలు నిర్వహించ బడినట్లు తెలిపారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని, మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు రాష్ట్ర పరిశీలకులు పలు కేంద్రాలను సందర్శించగా, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు డా. జె. రాంబాబు (డిఈసి1), వి. శ్రీనివాస్ (డిఈసి2), డి.వి.కె. వర్మ (డిఈసీ3) కూడా పర్యవేక్షణ చేపట్టినట్లు తెలిపారు. మొత్తంగా ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పరీక్షలు ప్రశాంతంగా, క్రమబద్ధంగా కొనసాగుతున్నాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి తెలిపారు.

# ప్రభుత్వ పథకాల లక్ష్య సాధనలో బ్యాంకర్ల పాత్ర కీలకం



**కాకినాడ, పెన్ పవర్,మార్చి 17:**ప్రభుత్వ పథకాల లక్ష్య సాధనలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలని, రైతులు, స్వయం సహాయక సంఘాలు, యువతకు రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశాలు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధ్యక్షతన నిర్వహించగా, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వివిధ రంగాలకు, ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలకు రుణాల కల్పనపై సమీక్షించి, రాబోయే త్రైమాసికాల కార్యాచరణపై చర్చించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వార్షిక రుణ ప్రణాళిక కింద 26,408 కోట్ల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 26,074.5 కోట్ల రుణాలు మంజూరు చేసి 98.73 శాతం లక్ష్య సాధన జరిగిందన్నారు. వ్యవసాయ రంగంలో స్వల్పకాలిక రుణాల కింద 13,733 కోట్ల లక్ష్యానికి 12,632 కోట్ల రుణాలు రైతులకు అందించామని తెలిపారు. రాబోయే త్రైమాసికాల్లో పంట రుణాల మంజూరు వేగవంతం చేయాలని బ్యాంకర్లకు సూచించారు.

జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా 10,186 డ్వాక్రా సంఘాలకు 1,298.71 కోట్ల రుణాలు, మెప్మా ద్వారా 2,737 పట్టణ సంఘాలకు 420.52 కోట్ల రుణాలు అందించారని తెలిపారు. అదేవిధంగా 3,526 మంది మహిళా పారిశ్రామికవేత్తలకు 55.55 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. పీఎంఈజీపీ కింద 122 యూనిట్ల లక్ష్యానికి గాను 180 యూనిట్లకు 850 కోట్ల రుణాలు మంజూరు చేయగా, ప్రధానమంత్రి ముద్రా యోజన కింద 386 మందికి 170 కోట్ల రుణాలు అందించామని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉపాధి, ఆర్థిక ప్రోత్సాహక పథకాలపై గ్రామస్థాయిలో అవగాహన పెంచాలని, ప్రాధాన్యతా రంగాలకు రుణాల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం నాబార్డ్ ద్వారా 202627 ఆర్థిక సంవత్సరానికి 23,598 కోట్ల రుణ ప్రణాళికను విడుదల చేశారు. నాబార్డ్ ఎల్డీఎం వై. సోమనాయుడు మాట్లాడుతూ మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాను ఎంపిక చేసినట్లు తెలిపారు. దీనిలో భాగంగా కాకినాడ జిల్లాలో 9 వ్యాపారాల్లో 150 యూనిట్ల స్థాపనకు సుమారు 5 కోట్ల రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా 500 నుంచి 800 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ బీజీఆర్ నాయుడు, ఆర్బీఐ ఎల్డిఓ గిరిధర్,జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సీహెచ్‌ఎస్వి ప్రసాద్, వ్యవసాయ శాఖ జేడీ ఎన్.విజయ్ కుమార్,జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం సీహెచ్ గణపతి,డీఆర్డీఏ పీడీ జి. శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఆత్మవిశ్వాసమే ఆయుధం





**కాకినాడ పెన్ పవర్, మార్చి 17:**మహిళలు ఆత్మవిశ్వాసాన్ని ఆయుధంగా చేసుకుని తమ కుటుంబాలను సుసంపన్నం చేసుకోవాలని కాకినాడ 3వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి జి. ఆనంది పిలుపునిచ్చారు. నేటి సమాజంలో మహిళలకు ఎంతో అధునాతన అవకాశాలు ఉన్నాయని, ప్రతి మహిళలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని,దానిని వెలికితీయడానికి సరైన మార్గదర్శకత్వం అవసరమని తెలిపారు. ఈ దిశగా రెడ్ క్రాస్ వంటి సంస్థలు ముందుకు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. పిల్లలను సరైన మార్గంలో తీర్చిదిద్దడంలో గృహిణుల పాత్ర ఎంతో కీలకమని, అందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. రెడ్ క్రాస్ మహిళా శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో మహిళల స్వయం ఉపాధి కోసం నిర్వహించిన ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ మరియు యోగా శిక్షణా కార్యక్రమాలలో పాల్గొన్న మహిళలకు ధ్రువీకరణ పత్రాల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళల పురోభివృద్ధి కోసం రెడ్ క్రాస్ నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు ప్రశంసనీయమని,ఇలాంటి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్న చైర్మన్ పి.డి. రామారావును అభినందించారు. తనను ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ పి.డి. రామారావు మాట్లాడుతూ మహిళలలో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే రెడ్ క్రాస్ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో నిర్వహించబోయే శిక్షణా కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి కే. శివకుమార్, కార్యవర్గ సభ్యురాలు ఎన్. భానుమతి, స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షకుడు జె. అరవింద్, యోగా శిక్షకురాలు ఇందిరతో పాటు మహిళా సభ్యులు మెట్టా రాధ, పి. పద్మజా వాణి, సుశ్రీ, వై. రజని కుమారి, మీనాక్షి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఏడువారాల వెంకన్న దర్శనానికి భక్తుల రద్దీ అన్నదానానికి విరాళం



**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 17:**కోనసీమ ఏడువారాల వెంకటేశ్వర స్వామివారి దర్శనానికి తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి నిలువెత్తు దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు. మంగళవారం ఆలయ సన్నిధిలో విశిష్ట పూజా కార్యక్రమాలను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి భక్తులు విరాళాలు సమర్పించారు. కృష్ణ జిల్లా మచిలీపట్నంకు చెందిన దేవనబోయినరామమోహనరావువాణి దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి రూ.1,00,116 విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, ఆలయ ఉపక్రమిస్తారు నల్ల సూర్య చక్రధర్ రావు చిత్రపటాన్ని వారికి బహుకరించారు.

## పేదలకు పోషకాహార భోజనంలో అన్నా క్యాంటీన్‌ల కీలక పాత్ర



**కాకినాడ, పెన్ పవర్,మార్చి 17:**పేదలకు తక్కువ ఖర్చుతో పోషకాహార భోజనం అందించడంలో అన్నా క్యాంటీన్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని కాకినాడ నగర శాసనసభ్యులు వనమాడి కొండబాబు తెలిపారు. మంగళవారం జగన్నాథపురం అన్నమ్మ ఘాటీ సెంటర్‌లో ఉన్న అన్నా క్యాంటీన్‌ను ఆయన సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న లబ్ధిదారులతో మాట్లాడి ఆహారం నాణ్యత, పంపిణీ విధానం, త్రాగునీటి సౌకర్యం, పరిశుభ్రత వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందుతున్న భోజనం పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ, తక్కువ ధరకే మంచి ఆహారం అందడం తమకు ఎంతో ఉపశమనం కలిగిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా వనమాడి కొండబాబు మాట్లాడుతూ రోజు వారీ కూలీలు, నిరుపేదలు, వలస కార్మికులకు అన్నా క్యాంటీన్‌లు ఆశ్రయంగా మారాయని చెప్పారు. కేవలం రూ.5కే భోజనం అందించడం ద్వారా ఆకలి సమస్యను గణనీయంగా తగ్గిస్తున్నాయని, ఈ పథకం పేదల జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమం పేదల సంక్షేమానికి దోహదపడుతూ సమాజంలో ఎవ్వరూ ఆకలితో ఉండకూడదనే లక్ష్యాన్ని సాధించడంలో ముందంజలో ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ కేవీ సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్ కేటీ సుధాకర్, స్థానిక నాయకులు గెద్దం పూర్ణచంద్ర శేఖర్, పాలిక నాని, పెదపూడి కుమార్, మేడిశెట్టి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## నూకాంబిక జాతరకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు



కొత్తపేట డిఎస్పీ మురళీకృష్ణ


**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 17;**దేశ విదేశాలలో ఉన్న తెలుగువారిలో ప్రత్యేకతను సంతరించుకున్న మండలంలోని చింతలూరులో వేంచేసియున్న శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలకు పోలీసు బలగాలతో భారీ బందోబస్తు మధ్య కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టామని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీకఅష్ణ అన్నారు. ఈ మేరకు మంగళవారం అమ్మవారి దర్శనం అనంతరం ఆయన ఆలయ ఆవరణలో రావులపాలెం సిఐ సిహెచ్.విద్యాసాగర్, స్థానిక ఎస్ఐ జి.నరేష్, ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి, రామచంద్రపురం దేవాదాయ శాఖ తనిఖీదారు బాలాజీ రాంప్రసాద్, చైర్మన్ వీరి అప్పారావు గౌడ్ లతో కలసి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి, కార్యాచరణను రూపొందించుకున్నారు. ఈ ఏడాది అన్నివైపులా నుంచి నుండి లక్షలాదిగా యాత్రికులు తరలివస్తారని అంచనా ఉన్నట్లుగా వారన్నారు. ఇందుకు 120 మంది వరకు పోలీసు సిబ్బంది అనునిత్యం పర్యవేక్షణలో ఉంటారని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా సిబ్బందికి సమావేశంలో గ్రామ రూట్ మాప్ ను స్థానిక ఎస్ఐ నరేష్ క్షుణ్ణంగా వివరించారు. అలాగే పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక పోలీస్ పికెట్ ద్వారా నిరంతరం పరవేక్షిస్తామని సిబ్బంది విధుల్లో నిర్దేశించిన ప్రదేశాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే జాతర, తీర్థం సందర్భంగా ఎవరైన ఆకతాయిలు అల్లర్లకు, ర్యాగింగ్ లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గన్ని వెంకట్రావు, మాజీ ఆలయ చైర్మన్ వైట్ల శేషుబాబు, జూనియర్ అసిస్టెంట్ కృష్ణ పవన్, పలువురు ఎస్ఐలు, ఏఎస్ఐలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం





**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 17;**ఆలమూరు మండలంలోని నర్సిపూడి గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆలమూరు వారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆలమూరు మండలం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎల్ అనిత అధ్యక్షతన ఈ పశు వైద్య శిబిరాన్ని ఆలమూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొత్తపల్లి వెంకటలక్ష్మి దుర్గారావు, అధ్వర్యంలో మాజీ ఏఎంసీ చైర్మన్ దునే స్వామి నాయుడు, సొసైటీ అధ్యక్షులు రాయుడు వెంకటస్వామి (బాబ్జి), జనసేన నాయకులు వుండమట్ల బాలాజీ కొత్తపల్లి నగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో రెండు పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసుకునేందుకు కూటమి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందని మొదటి గా నర్సిపూడి గ్రామంలో ఏర్పాటు చేసామని, రెండోది రేపు పినపళ్ళ గ్రామంలో ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ పశువైద్య శిబిరంలో డాక్టర్లు జి భాను ప్రకాష్, బి సుభాష్ చంద్ర సమక్షంలో 85 మంది పశు పోషకులు తీసుకువచ్చిన 151 పశువులకు వైద్య సేవలను అందజేసారు. వాటిలో 70 పశువులకు ఆరోగ్య గర్భకోశ పరీక్షలు నిర్వహించగా మిగిలిన 81పశువులకు నట్టల నివారణ నిర్వహించి పశు ఆరోగ్య నిమిత్తం మెరుగైన పోషక విలువలు కలిగిన మినరల్ మిక్చర్ ప్యాకెట్లును, ప్రతి ఒక్క పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి వి పైడేశ్వరావు పశు వైద్య శాఖ,మార్కెట్ కమిటీ సిబ్బంది, పాడి రైతులు, గ్రామస్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## గ్రామాభివృద్ధికి పంచాయతీలు ఆర్థికంగా బలపడాలి



ఎంపీడీవో ఏ రాజు

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 17;**గ్రామాభివృద్ధికి పంచాయతీలు ఆర్థికంగా బలపడి స్థిరమైన పురోగతిని సాధించాలని ఎంపీడీవో ఏ.రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వార్డు సభ్యులు, ఎంపీటీసీలకు ఒకరోజు శిక్షణ తరగతుల కార్యక్రమం మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజు మాట్లాడుతూ గ్రామపంచాయతీల ఆదాయ వనరులు పెంపొందించడం, మిలీనియం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను గ్రామస్థాయిలో సమర్థంగా అమలు చేసే విధానాలపై చర్చించారు. అలాగే ఈ శిక్షణకు తర్ఫీదు పొందిన మోదుకూరు పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి సాయి ప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీలకు లభించే పన్నులు, ఫీజులు, ప్రభుత్వ పథకాల నిధులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా ఆదాయ వనరులను పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే అభివృద్ధి లక్ష్యాలను గ్రామస్థాయిలో అమలు చేయడం ద్వారా పరిశుభ్రత, తాగునీరు, ఆరోగ్యం, విద్య వంటి రంగాల్లో గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. ప్రజల అవసరాలను గుర్తించి గ్రామపంచాయతీలు ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు దగ్గరగా ఉండి వారి సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించాలని శిక్షణలో భాగంగా సాయి ప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో మెహర్ ప్రకాష్, డిప్యూటీ ఎంపీడీవో వీర్రాజు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఫైలేరియా బాధితులకు మోర్బిడిటీ మేనేజ్‌మెంట్ కిట్స్ పంపిణీ






**కొత్తపేట,పెన్ పవర్, మార్చి 17:** అవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మోడీకుర్రు గ్రామంలో ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు మంగళవారం మోర్బిడిటీ మేనేజ్‌మెంట్ కిట్స్‌ను జిల్లా మలేరియా అధికారి నక్క వెంకటేశ్వరరావు 45 మంది వ్యాధిగ్రస్తులకు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కుడుపూడిరామలక్ష్మి, వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డా. శివ గాయత్రి సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కిట్స్‌లో ప్లాస్టిక్ టబ్, మగ్గు,టవల్,ఆయింట్మెంట్లు,డెటాల్ సబ్బు వంటి అవసరమైన సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మలేరియా అధికారి మాట్లాడుతూ,ఫైలేరియా బాధితులు ప్రతిరోజూ ప్రభావిత అవయవాన్ని నీటితో నింపిన టబ్‌లో ఉంచి,సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం టవల్‌తో తేమ లేకుండా తుడుచుకోవడం,పుండ్లు ఉన్నవారు ఆయింట్మెంట్ వినియోగించడం ద్వారా ఇన్ఫెక్షన్లు తగ్గుతాయని తెలిపారు. అలాగే ప్రతి సంవత్సరం రెండు సార్లు, ఒక్కోసారి 12 రోజుల పాటు డీ.ఈ.సీ మాత్రలు వాడాలని సూచిస్తూ,దీనివల్ల వ్యాధి తీవ్రతను నియంత్రించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.రాజుబాబు, పీహెచ్సీ సూపర్వైజర్ రామలింగేశ్వరరావు, కె. రవిచందర్,ఆరోగ్య సిబ్బంది పి. వెంకటేష్,కె.దావీద్ రాజు,కె.మాచరరావు,జీ.వి. రమణ, ఎన్. షర్మిల,ఏఎన్ఎంలు,ఆశా వాలంటీర్లు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఈ సేవలను వినియోగించుకుని ఆరోగ్య పరిరక్షణపై దృష్టి పెట్టాలని అధికారులు కోరారు.

# ఎపి అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జెఏసి కిర్లంపూడి మండల కమిటీ ఎన్నిక.

**-జేఏసీ చైర్మన్ గా కిర్లంపూడి తహసీల్దార్ కె సాయికిరణ్.**



**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి 17:**ఏ పి అమరావతి రెవిన్యూ ఎంప్లాయిస్ జె ఎ సి కిర్లంపూడి మండలం కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మన్ గా మండల తహశీల్దార్ కూన సాయికిరణ్, కోచైర్మన్ గా మండల రెవెన్యూ అధికారిణి కె వి సత్యదేవి, మండల కన్వీనర్ గా ఎం. గుర్రయ్య సెక్రటరీ జనరల్ గా సర్వేయర్, జి అనిల్ కుమార్, ట్రెజరర్ గా వి ఆర్ ఓ,ఎస్.జాన్ బాబు,వైస్ చైర్మన్లుగా జి సతీష్ కుమార్, బి శివరామకృష్ణ, బి సాయి ప్రకాష్, బి వి ప్రసాదరావు,జాయింట్ సెక్రెటరీ లుగా కె డి ప్రసాద్, ఎం అచ్యుత్ రావు, జి వెంకన్న పలువురు తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది ని కార్యవర్గ సభ్యులుగా ప్రజాస్వామ్య బద్దంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక ప్రక్రియలో చైర్మన్ గాఎన్నికైన కిర్లంపూడి తహశీల్దార్ కూన సాయికిరణ్ మాట్లాడుతూ ఎపి అమరావతి రెవిన్యూ ఎంప్లాయిస్ జెఏసికి అన్ని విధాలా సహకరిస్తానని తెలియజేసారు. జిల్లా కమిటీ తరుపున రాష్ట్ర వీఆర్వోల సంఘం రాష్ట్ర జాయింట్ కార్యదర్శి అనిశెట్టి రామకృష్ణ, ఎపి అమరావతి రెవిన్యూ ఎంప్లాయిస్ జెఏసి వైస్ చైర్మన్ మల్లేష్ అల్లాడి, కాకినాడ జిల్లా జాయింట్ కార్యదర్శి అవసరాల కిషోర్, కాకినాడ డివిజన్ అధ్యక్షులు మెడిశెట్టి కిషోర్ సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వీఆర్వోలు,వీఆర్ఏలు, సర్వేయర్లు ,తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వీఆర్వోల సంఘం కిర్లంపూడి మండల కమిటీ ఎన్నిక. -సంఘం అధ్యక్షుడిగా మందేటి గుర్రయ్య



**కిర్లంపూడి,పెన్ పవర్,మార్చి 17:** కిర్లంపూడి మండలం వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా మందేటి గుర్రయ్యతోపాటు కమిటీ సభ్యులను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా వీఆర్వోల సంఘం తరపున రాష్ట్ర విఆర్వోల సంఘం జాయింట్ కార్యదర్శి అనిశెటి రామకృష్ణ, ఏపీ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ వైస్ చైర్మన్ మల్లేష్ అల్లాడి,జిల్లా జాయింట్ సెక్రెటరీ అవసరాల కిషోర్, కాకినాడ డివిజన్ అధ్యక్షులు మేడిశెట్టి కిషోర్ సమక్షంలో తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో ప్రక్రియలో ముకొల్లు విఆర్ఓ గా పనిచేస్తున్న మందేటి గురయ్యను మళ్లీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడమే కాకుండా, కిర్లంపూడి మండలం వీఆర్వోల సంఘం ఉపాధ్యక్షులుగా గెద్దానపల్లి వీఆర్వో గా పని చేస్తున్న షేక్ ఇస్మాయిల్ ను,కార్యదర్శిగా జగపతినగరం వీఆర్వో గా పని చేస్తున్న జి సూర్యప్రకాశరావును, కోశాధికారిగా గోనేడ విఆర్ఓ గా పనిచేస్తున్న ఎస్ జానుబాబును,సంయుక్త కార్యదర్శిగా బూరుగుపూడి విఆర్వో గా పని చేస్తున్న ఎం సునీత తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఏకంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా మళ్లీ ఎన్నికైన మందేటి గర్రయ్య మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో గత గత 15 సంవత్సరాలుగా సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకుంటున్న తోటి విఆర్వోలకు,రెవెన్యూ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. మండల విఆర్ఓల సంఘం నూతన కమిటీ సభ్యులను ఏపీ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జెసి చైర్మన్ గా ఎన్నికైన కిర్లంపూడి తహసీల్దార్ కూన సాయికిరణ్, కో చైర్మన్ కె వి సత్యదేవి,జిల్లా సంఘం నాయకులు మండలంలోని రెవెన్యూ సిబ్బంది అభినందించారు.

## ఓఎన్జీసీ అన్యాయాలపై రైతుల నిరసన

- సోమవారం నిరాహార దీక్ష చేపడతామని వెల్లడి





**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 17;**ఓఎన్జిసి గ్యాస్ కలెక్షన్ సెంటర్ మండపేట పరిధిలో పెదపళ్ళ రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన పొలాలకు నగదు చెల్లించకుండానే ఓఎన్జీసీ సదరు స్థలాల్లో నిర్మాణాలు పూర్తి చేయడంపై రైతులు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓఎన్జీసీ సైట్కు చేరుకుని కొద్దిసేపు నిరసన ప్రదర్శన చేపట్టారు. వెంటనే పనులు నిలిపివేయాలని నినాదాలు చేశారు. తమకు రావలసిన నగదును చెల్లించకుండా తమ ఆస్తుల్లో పెత్తనం చెలాయించడం సరికాదన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తికాకుండానే తమ భూములపై అజమాయిషీ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రెండున్నర ఏళ్లుగా ఓఎన్జీసీ చుట్టూ తిరుగుతున్న, కలెక్టర్, ఆర్డీవోలకు ఫిర్యాదు చేసిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ అంశాన్ని స్థానిక శాసనసభ్యులు బండారు సత్యానందరావు ద్వారా ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. ఓఎన్జిసి అధికారులు తక్షణమే స్పందించి తమకు రావలసిన నగదును తమకు చెల్లించనిచో ఈనెల 23వ తేదీ నుంచి తమ పొలాల వద్ద నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ అంశంపై ఓఎన్జీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సలాది నాగేశ్వరరావు, బొబ్బా వెంకన్న, అల్లూరి సత్యనారాయణ, శ్రీని శ్రీధర్, బలుసు శ్రీనివాస్, కంచర్ల వెంకటేశ్వరరావు, సలాది కృష్ణమూర్తి, వైట్ల జనార్ధన ప్రకాష్, బొబ్బా ఏసుబాబు, పిల్లి వెంకటేశ్వర్లు,బొబ్బా పట్టాభి రామయ్య, యన్నన సుబ్బారావు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## రైతన్నకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకున్నాం

- యువ నాయకులు బండారు సంజీవ్




**ఆత్రేయపురం, పెన్ పవర్, మార్చి 17:**రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రైతన్నకు ఇచ్చిన హామీలను పూర్తిగా నిలబెట్టుకున్నామని యువ నాయకులు బండారు సంజీవ్ అన్నారు. మంగళవారం ఆత్రేయపురం మండలం ఉచ్చిలి గ్రామంలో నిర్వహించిన "రైతన్న మీకోసం" కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బండారు సంజీవ్ మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు విత్తనాలు, ఎరువులు, సబ్సిడీలు, పంటల కొనుగోలు వంటి అంశాల్లో రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు

అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతుల అభివృద్ధి లేకుండా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదని, అందుకే రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు స్థానిక నాయకులు, కార్యకర్తలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు.

# నేటి నుండి ఆర్టీసీలో ఉగాది కానుకగా దివ్యాంగ శక్తి పథకం అమలు.

## పంచ సూత్రాలతో వ్యవసాయం పండగ

## అన్నదాతలకు కూటమి ప్రభుత్వం భరోసా





**కొత్తపేట, పెన్ పవర్ మార్చి17;**రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. కొత్తపేటమండలం పలివెల శేరిపాలెంలో నిర్వహించిన "రైతన్నా మీకోసం"కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులతో ప్రత్యక్షంగా ముచ్చటించారు.

ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రైతన్నా మీకోసం కరపత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే, ప్రభుత్వం తీసుకొస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు రూపొందించిన పంచ సూత్రాలతో వ్యవసాయ రంగం పండగలా మారుతుందని ఆయన అన్నారు.సూపర్ సిక్స్ పథకాలు ఇప్పటికే సూపర్ హిట్ అయ్యాయని పేర్కొన్నారు.

పీఎం కిసాన్,అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా కలిపి సంవత్సరానికి రూ.20 వేల వరకు రైతుల ఖాతాల్లో మూడు విడతలుగా నేరుగా జమ చేస్తున్నామని వివరించారు.గత ప్రభుత్వంలో రైతు భరోసా పేరిట రైతులను మోసం చేశారని,ఏడాదికి కేవలం రూ.7,500 మాత్రమే అందించారని విమర్శించారు.

నీటి భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పోలవరం,వెలిగొండ వంటి ప్రధాన ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.అగ్రిటెక్ భాగంగా ఆధునిక యంత్రాలు, డ్రోన్లను సబ్సిడీపై అందిస్తూ వ్యవసాయాన్ని ఆధునికీకరిస్తున్నామని తెలిపారు.

అదేవిధంగా డిమాండ్ ఆధారిత పంటల సాగుపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.ఫుడ్ ప్రాసెసింగ్,వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటు ద్వారా రైతులకు మరింత ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.గతంలో ధాన్యం విక్రయించిన తర్వాత రైతులకు చెల్లింపులు రావడానికి నెలల తరబడి ఆలస్యం జరిగేదని,ఇప్పుడు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమవుతున్నదని తెలిపారు. అన్నదాతల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు,రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైతులను ఆదుకుంటాం ఎమ్మెల్యే దాట్ల



**కాట్రేనికోన పెన్ పవర్ మార్చి 17:**ఏటిగట్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తాం రైతులను ఆదుకుంటాం

కాట్రేనికోన మండలం తీర ప్రాంత సమీపంలో ఉన్న వరిచేలు సముద్రపు నీరు పోటు ఎత్తడంతో పండడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నిళ్ళుగా ఇదే పరిస్థితి రావడంతో పండించడం మానేశారు. మంగళవారం ఆ ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు రైతులకు హామీ ఇచ్చారు. పాడైపోయిన షట్టర్ ప్రాంతంలో కొత్త షటర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఏటుగట్టు నిర్మాణానికి రెండు కోట్లు మంజూరు చేశామని, అది పూర్తి అయిపోయిన తర్వాత పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తి చేయడానికి మరో 10 కోట్లు తీసుకొస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఏటిగట్టు ఆక్రమణలను తొలగించి హెడ్ వర్క్స్ కు అప్పచెప్పాలని తాసిల్దార్ రవికిరణ్ ను ఎమ్మెల్యే ఆదేశించారు అనంతరం సత్తమ్మ చెట్టు ప్రాథమిక పాఠశాలకు వెళ్లి పిల్లలకు పెడుతున్న ఆహారాన్నిపరిశీలించారు. ఆయన ఆహారాన్ని రుచి చూశారు. సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కాట్రేనికోన హైస్కూల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలను పరిశీలించారు. వెంటనే వాటి నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షుడు చెల్లి సురేష్, నీటి సంఘం డైరెక్టర్ వాసంశెట్టి రాజేశ్వరరావు, కాట్రేనికోన సొసైటీ డైరెక్టర్ మోకా అప్పాజీ, మండల టిడిపి యూత్ అధ్యక్షుడు వంగా దుర్గ బాబు, టిడిపి నాయకులు పచ్చమట్ల సూర్యనారాయణ రాజు, కాండ్రేగుల సత్య ప్రసాద్, వనసర్ల నాగేశ్వరరావు, శీలం సూర్యనారాయణ, జంగా శ్రీనివాసరావు, బండారు ఏసు, నల్ల రామకృష్ణకదలి కార్యక్రమంలో పాల్గొన్నారు.



**ఏలేశ్వరం, పెన్ పవర్, మార్చి 17:** నేటి నుండి రాష్ట్ర ప్రభుత్వం ఉగాది కానుక దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ఏలేశ్వరం డిపో మేనేజర్ జీవి సత్యనారాయణ మంగళవారం వెల్లడించారు.పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు , సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ప్రెస్, ఎక్స్ప్రెస్ అనే ఐదు రకాల బస్సులలో ఈ దివ్యంగా శక్తి పథకం వర్తిస్తుందని ఒక ప్రకటనకు తెలిపారు. ప్రస్తుతం 40 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం ఉన్న దివ్యంగులకు, 100% కంటి చూపు లేని వారికి, 100 శాతం మూగ చెవిటి వారికి, అలాగే 40% కంటే ఎక్కువ వైకల్యం ఉన్న మానసిక దివ్యాంగులు మాత్రమే ఏపీఎస్ఆర్టీసీ సిటీ ఆర్డినరీ బస్సులలో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్ బస్సులలో వీరికి 50% రాయితీ లభిస్తుంది. అయితే ఈ దివ్యంగా శక్తి పథకం కింద దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ పొందిన వారందరికీ ఈ పథకం వర్తిస్తుందని, అలాగే వారి సదరం సర్టిఫికెట్ లో ఉన్న సహాయకులకు ఈ బస్ లలో 50% రాయితీ లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగ శక్తి పథకం 18 వ తారీకు బుధవారం ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గం ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు డిఎం తెలిపారు.


## రెండు సంవత్సరాల నుండి నిర్విరామంగా డొక్కా సీతమ్మ కాంటీన్ నిర్వహణ

- సొంత ఖర్చులతో అన్నదానం చేస్తున్న తుమ్మలపల్లి రమేష్
- రాష్ట్రంలో కేవలం జగ్గంపేటలో మాత్రమే డొక్కా సీతమ్మ క్యాంటీన్
- పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ముందుకు వెలుతున్న తుమ్మలపల్లి రమేష్



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 17:** రాష్ట్రవ్యాప్తంగా అనేకచోట్ల కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్లు చూస్తుంటారు. అయితే కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేట పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రతీ మంగళవారం జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ గత రెండు సంవత్సరాల నుంచి నిర్విరామంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జగ్గంపేటలో మాత్రమే జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించిన తర్వాత జగ్గంపేటలో డొక్కా సీతమ్మ పేరిట ఉచిత అన్నదాన క్యాంటీన్ ప్రారంభించారు. అయితే ప్రతి సోమవారం టిడిపి ఆధ్వర్యంలో జగ్గంపేట ఎన్టీఆర్ విగ్రహం వద్ద అన్నా క్యాంటీన్ నిర్వహించి దాతల సహకారంతో అన్నదానం చేస్తారు. కానీ ప్రతి మంగళవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే డొక్కా సీతమ్మ క్యాంటీన్లో కేవలం తుమ్మలపల్లి రమేష్ తన సొంత ఖర్చులతో అన్నదానం చేస్తున్నారు. ప్రతి మంగళవారం వందలాది మందికి అన్నదానం చేస్తూ పేదల ఆకలి తీరుస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. సేవే పరమావధిగా తుమ్మలపల్లి రమేష్ ముందుకెళ్తున్నారు. జగ్గంపేట చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు వివిధ పనులకు జగ్గంపేటకు వచ్చిన సమయంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ లో భోజనం చేసి సంతోషిస్తున్నారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో కూడా జనసేన పార్టీ ఆధ్వర్యంలో క్యాంటీన్ లేదని జగ్గంపేటలో నిర్విరామంగా నిర్వహించడంపై కొనియాడుతున్నారు. సొంత ఖర్చులతో ప్రతి మంగళవారం అన్నదానం చేయడం అంటే మామూలు విషయం కాదని తుమ్మలపల్లి రమేష్ వంటి నాయకులు ప్రతి గ్రామంలో ఉండాలని ఆకాంక్షిస్తున్నారు.

## రాజపూడి డ్వాక్రా యానిమేటర్ పై చర్యలు తీసుకోవాలి



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 17:** జగ్గంపేట మండలం రాజపూడి డ్వాక్రా ఎన్ని మీటర్ పై చర్యలు తీసుకునే సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ రాజపూడి గ్రామంలో కృప మహిళా శక్తి సంఘం గ్రూపు 2022లో రూ.15 లక్షలు లోన్ తీసుకోవడం జరిగింది. తీసుకున్నప్పటినుంచి 32 నెలలు ఒక్కొక్కరు రూ.3,100 చొప్పున నెలకు రూ.31,000 కట్టి త్వరగా తీరిపోతుందని నెలకు రూ.4,100 చొప్పున నెలకు రూ.41వేలు ప్రెసిడెంట్ తీసుకువెళ్లి యానిమేటర్ హైమావతి కి ఇవ్వడం జరిగింది. కానీ గత 20 నెలల నుంచి లోను కట్టడం మానేసి సుమారు రూ.7.75 లక్షలు మాయంచేసి ఇప్పుడు ఏమి చేసుకుంటారో చేసుకోండి అని యానిమేటర్ అంటుందన్నారు. గ్రూప్ సభ్యులు ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకురావడంతో మంగళవారం జగ్గంపేట ఏపిఎంకి వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. అమాయకురాలైన దళిత మహిళ (డ్వాక్రా ప్రెసిడెంట్)ను యానిమేటరు నమ్మించి మొత్తం డ్వాక్రా సొమ్మును కాజేసిందంటే అధికారులు ఏ విధంగా డ్వాక్రా సంఘాలను పర్యవేక్షిస్తున్నారో తెలుసుకోవాలని ఆయన విమర్శించారు. తక్షణమే డ్వాక్రా సంఘాలలో జరుగుతున్న అవకతవకలపై చర్యలు చేపట్టి, రాజపూడి యానిమేటర్ హైమావతిపై చర్యలు తీసుకొని, వారికి సహకరించిన సిసి, ఏపిఎం, బ్యాంక్ మేనేజర్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని, పోయిన సొమ్ము రికవరీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళా సంఘం సభ్యులు వారి బంధువులు పి డి యస్ యు (వి) రాష్ట్ర కార్యదర్శి కే సతీష్, బిజెపి నాయకులు అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవంలో పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం




**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 16:**అమలాపురం మున్సిపల్ కార్యాలయంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చేస్తున్న కార్యక్రమాలలో భాగంగా మంగళవారం బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పొనుగుపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో ఘనంగా సత్కరించి మెమెంటోలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అమలాపురం మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్, పట్టణ అధ్యక్షులు అయ్యల భాషా తదితరులు పాల్గొన్నారు.

## సుస్థిర, అభివృద్ధి లక్ష్యాల అమలుపై ప్రజాప్రతినిధులకు శిక్షణ.






**ఏలేశ్వరం, పెన్ పవర్, మార్చి 17:** సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్ధవంతంగా అమలు చేయటానికి ప్రజా ప్రతినిధులకు మండల ప్రజా పరిషత్ హాల్లో శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికైన యం పి టి సి లు, వార్డు సభ్యులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ అభివృద్ధి సుస్థిర లక్ష్యాలను (ఎస్.జి.డి.) స్థానిక స్థాయిలో అమలు చేయడానికి ఎంపీటీసీ వార్డు, ప్రజా ప్రతినిధులకు ఈ శిక్షణ కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, లక్ష్మణరావు, సాదే లోవరాజు, డిప్యూటీ ఎంపీడీవోలు రామరాజు వర్మ, సి హెచ్ ఏస్ సత్యనారాయణరాజు,పాలక వర్గ సభ్యులు పసల సూరిబాబు, ఇజనగిరి ప్రసాద్, కొప్పుల బాబ్జి, పసల సూర్యనారాయణ,వివిధ గ్రామల ప్రజా ప్రతినిధులు, వార్డ్ సభ్యులు, గ్రామ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# పిఎంఎంఎస్ వై పథకం ద్వారా ఇద్దరు లబ్ధిదారులకు ఆటోలు పంపిణీ

**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 17:** మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ అన్నారు. జగ్గంపేట రావులమ్మ నగర్ లోని టిడిపి కార్యాలయంలో జగ్గంపేట మండల మత్స్యశాఖ సహాయ తనిఖీ అధికారి కార్యాలయ పరిధిలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పి ఎం ఎం ఎస్ వై)లో లబ్ధిదారులైన జగ్గంపేట గ్రామానికి చెందిన మత్స్యకారుడు కొత్తపల్లి మోహన్ రావు కి (ఎస్సీ) 60 శాతం సబ్సిడీతోను, జగ్గంపేట మండలం జె.కొత్తూరు గ్రామానికి చెందిన రాయుడు సాయిరాం (బిసి) 40శాతం సబ్సిడీతోమంజూరైన ఆటోలు, ఐస్ బాక్సులు జ్యోతుల నవీన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవీన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పి ఎం ఎం ఎస్ వై) కింద మత్స్యకారులకు ఐస్ బాక్స్లతో కూడిన ఆటోలు (మూడు చక్రాల) సబ్సిడీపై పంపిణీ చేయబడుతున్నాయి. ఈ పథకంలో భాగంగా, ఆటోలపై, ఎనుకబడిన వర్గాలకు 60 శాతం జనరల్ కేటగిరీకి కు 40 శాతం ఆర్థిక సహాయం అందుతుంది. అని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, బురి సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, రాయి సాయి తుమ్మల కిషోర్, చింతల కన్నారావు, మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఎం లావణ్య , మత్స్యశాఖ తనిఖీ అధికారి కర్రీ రామకృష్ణ, మత్స్య శాఖ సహాయకురాలు కె పద్మ, పీలా మహేష్, బద్ది సురేష్, తదితరులు పాల్గొన్నారు.




03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


# కొత్తపేట సీహెచ్‌సీలో అభివృద్ధి పనులు రోగులకు మెరుగైన సదుపాయాల లక్ష్యం






**కొత్తపేట,పెన్ పవర్, మార్చి 17:** కొత్తపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగుల సౌకర్యాల మెరుగుదల కోసం అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ నిధులతో ఆసుపత్రి వివిధ విభాగాల్లో మరమ్మత్తులు చేపట్టినట్లు సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ తెలిపారు.

ఆసుపత్రిలోని వార్డులు,బాత్రూములు,సీలింగ్, బెడ్స్ వంటి మౌలిక సదుపాయాలను పునరుద్ధరించే పనులు ప్రాధాన్యంగా చేపట్టారు.పాడైపోయిన ఫర్నిచర్‌ను దిద్దడం, కిటికీలను పునరుద్ధరించడం,మంచాలకు కొత్తగా పెయింటింగ్ వేయడం,టైల్స్ మార్పిడి వంటి పనులు కొనసాగుతున్నాయి.ఈ చర్యలతో ఆసుపత్రి వాతావరణం మరింత శుభ్రంగా,సౌకర్యవంతంగా మారుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ తెలిపారు. అన్ని పనులు ప్రభుత్వ నిధులతోనే నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.ఈ అభివృద్ధి పనులు పూర్తయ్యాక ఆసుపత్రి సేవల నాణ్యత మరింత మెరుగుపడి,రోగులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించబడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# భద్రవరం గ్రామం లో పశువులకు గాలికుంటు వ్యాధిటీకాలు.



**ఏలేశ్వరం, పెన్ పవర్, మార్చి 17:** మండల పరిధిలోని భద్రవరం గ్రామంలో ఐడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు మంగళవారం వేశారు.

పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు. సంబంధిత శాఖ అధికారులతో పాటి పశువులకు స్థానిక నాయకుల సమక్షంలో గాలికుంటు వ్యాధి నివారణకు పశువుల సంరక్షణ దిశగా గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ గాలికుంటు టీకాలను రైతులు తప్పనిసరిగా పాడి పశువులకు వేయించాలని, పాడి రైతులకు సూచించారు. గాలికుంటు టీకాల యెక్క ప్రాముఖ్యతను వివరించారు.పాడి రైతులకు పశువర్ధక శాఖ సూచనలతో తమ పాడిపశులను సంరక్షించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ అంబేద్కర్, అసిస్టెంట్ డైరెక్టర్ బాలచంద్ర యోగేశ్వర్ ,భద్రవరం గ్రామ సర్పంచ్ కూనపరెడ్డి సుబ్బారావు, టిడిపి నాయకులు జగటాపు సూరిబాబు, బిజెపి నాయకులు పోలినాటి బుజ్జి, గ్రామ నాయకులు పశు వైద్య సిబ్బంది ,పాడి రైతులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ కాలువ ఆక్రమణలు తొలగించాలి: పంచాయతీ నోటీసులు



**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 17:**రావులపాలెం మండలం ఊటలంక గ్రామ పంచాయతీ పరిధిలోని,బొబ్బర్లంకముక్తేశ్వరం ఇరిగేషన్ కాలువ గట్టు వద్ద జరిగిన ఆక్రమణలను తొలగించాలని పంచాయతీ అధికారులు మంగళ వారం నోటీసులు జారీ చేశారు. ఇరిగేషన్ కాలువ గట్టును ఆక్రమించి రేకుల షెడ్లు, పూరిల్లు, పెంకుటిళ్లు, ఆర్‌సీసీ డాబా ఇళ్లు నిర్మించినట్లు గుర్తించారు.రావులపాలెంకు చెందిన ఉందుర్తి సురేష్ చేసిన ఫిర్యాదు తో లోకాయుక్త ఆదేశాలపై విచారణ జరిపిన అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో హైపవర్ కమిటీ పరిశీలన చేపట్టింది. ఈ పరిశీలనలో ఊటలంక పంచాయతీ పరిధిలో మొత్తం 108 ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు.దీనిపై ప్రభుత్వం ఉత్తర్వులు, హైకోర్టు ఆదేశాల తో సంబంధిత ఆక్రమణదారులు 15 రోజుల్లోగా స్వయంగా ఆక్రమణలు తొలగించుకోవాలని పంచాయతీ కార్యదర్శి శరభరాజు, వీఆర్వో లక్ష్మీపతి,నోటీసులు జారీ చేశారు. నిర్ణీత గడువులోగా తొలగించకపోతే ఇరిగేషన్ శాఖ సహకారంతో అధికారులు స్వయంగా తొలగింపు చర్యలు చేపడతారని తెలిపారు.

## ఏలేశ్వరంలో పంచాయతీరాజ్ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన.









**ఏలేశ్వరం, పెన్ పవర్, మార్చి 17:** మండలంలో పంచాయతీరాజ్ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు మంగళవారం విచ్చేశారు. విస్తరణ శిక్షణా కేంద్రం సామర్లకోట నుంచి వచ్చిన అడ్మినిస్ట్రేటివ్ అధికారులు మండలంలోని మార్కండేయపురం వద్ద గల జల జీవన్ మిషన్ కు సంబంధించిన రూరల్ వాటర్ స్కీంను సందర్శించి, ఫిల్టర్ వాటర్ బెడ్ల పనితీరును, జలశుద్ధీకరణ, క్లోరినేషన్ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఏలేరు ప్రాజెక్టు నాలుగవ గట్టు వద్ద నిర్మించబడిన రూరల్ వాటర్ స్కీం ద్వారా రూరల్ మండలంలో ఎన్ని గ్రామాలకు శుద్ధ జలాలు అందించబడుతున్నాయో రూట్ మ్యాప్ ను పరిశీలించారు. అలాగే లింగంపర్తి గ్రామపంచాయితీ ని సందర్శించి గ్రామపంచాయితీ అభివృద్ధి ప్రణాళిక, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళిక, గ్రామపంచాయితీ రికార్డ్స్ గురించి అధికారులు వివరించారు.ఈ కార్యక్రమం లో సామర్లకోట నుంచి ఫ్యాకల్టీ మెంబర్స్ నిహారిక ,రామకృష్ణ , రాజ్ కుమార్ , లింగంపర్తి పంచాయితీ అభివృద్ధి అధికారి ఏ ఎస్ ఎన్ మూర్తి , సంబంధిత శాఖల స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# డ్రైవర్స్ కాలనీ వాసులకు న్యాయం చేయాలి



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 17:** జగ్గంపేట డ్రైవర్స్ కాలనీవాసులకు న్యాయం చేయాలని మంగళవారం జగ్గంపేట తహసిల్దార్ వద్ద ఆ కాలనీ వాసులు ఆందోళన నిర్వహించారు. బహుజన సమాజ పార్టీ కాకినాడ జిల్లా అడ్వైజర్ జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్ జుత్తుక నాగేశ్వరరావు కాలనీ వాసులతో కలిసి ఆందోళన నిర్వహించి తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ జగ్గంపేటలో డ్రైవర్లకి తోట వెంకటాచలం హయాంలో ఉచితంగా మనిషికి మూడు సెంట్లు చొప్పున 170 మందికి స్థలాలు ఇచ్చారన్నారు. అయితే కొంతమంది ఆ స్థలాలను అమ్మకానికి పెట్టడంతో పేదలు కొనుగోలు చేశారు. ఇప్పుడు ఆ భూములను ప్రభుత్వం వారు తీసుకోవడానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు. మా భూములను మాకు వదలండి మేమంతా నిరుపేదలం, అక్కడ ఎటువంటి సౌకర్యాలు లేనందువలన ఇంతవరకు మేము ఇల్లు నిర్మించుకోలేకపోయామని ఎంతో కష్టపడి కూలి పనులు చేసుకుని డబ్బులు పోగేసుకుని నిరుపేదలమైన మేము ఎటు ఆధారం లేకపోయినా ఆ స్థలం ఉంటే ఎప్పటికైనా ఇల్లు కట్టుకోవచ్చు కదా అనే ఆశతో ఉన్నామన్నారు. దీనిపై ఉన్నతాధికారులు, నాయకులు నిరుపేదలైన వారికి తగిన న్యాయం చేయాలని కోరారు.

# వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

సీఐ తిరుపతిరావు



**గండేపల్లి, పెన్ పవర్,మార్చి,17:**వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలి అని జగ్గంపేట సిఐ అన్నారు. ద్విచక్రవాహనాలు తనిఖీల లో భాగంగా గండేపల్లి మండల పరిధి 16వ నెంబర్ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహన చదకులను ఆపి తనిఖీలు నిర్వహించారు. ముందుగా హెల్మెట్ వాడుతున్న వాహన చోదకుడను ఆపి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ వాడకంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, వాహనం యొక్క అన్ని పత్రములు ఉండేవిధంగా చూసుకోవాలి అన్నారు. అదేవిధంగా సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడప రాదని సూచించారు. ముఖ్యంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఆయన కోరారు. ఈయన వెంట గండేపల్లి ఎస్సై శివ నాగబాబు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# పైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్లు పంపిణీ



**అల్లవరం,పెన్ పవర్,మార్చి 17:**అల్లవరం మండలంలోని బోడసకుర్రు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి చేతుల మీదుగా మంగళవారం పైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని, చిన్న చిన్న వ్యాధులు బారిన పడినప్పుడు గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య సేవలు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, తెలుగుదేశం గ్రామ కమిటీ అధ్యక్షులు అరవ చంటి, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు రోళ్ళ శ్రీను,పాలకవర్గ సభ్యులు ఓలేటి పరమేశ్వరరావు,చింతం శ్రీను, దొమ్మేటి రాధాకృష్ణ,హెల్త్ సూపర్వైజర్ సాపే సత్యనారాయణ, రాపాక సౌమ్య, నల్లి విజయ,ఎంఎల్ హెచ్పిలు, ఏఎన్ఎంలు,ఆరోగ్య సిబ్బంది,ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అమలాపురంలో ఆటో నగర్' ఏర్పాటుకు శ్రీకారం

ఛాంబర్ ఆఫ్ కామర్స్ కీలక నిర్ణయం



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 17:**అమలాపురం పట్టణంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆటో నగర్ ఏర్పాటు దిశగా అడుగులు పడ్డాయి. మంగళవారం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో అధ్యక్షులు కల్వకొలను తాతాజీ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు.

సమావేశం అనంతరం తాతాజీ మాట్లాడుతూ, అమలాపురం పట్టణం కోనసీమ జిల్లా కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో, ఆటోమొబైల్ రంగానికి ప్రత్యేకంగా ఒక 'ఆటో నగర్' అవశ్యకత ఎంతో ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో ఉన్న మెకానిక్ షెడ్లు, స్పేర్ పార్ట్స్ దుకాణాల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఆటో నగర్ ఏర్పాటుతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని ఆయన వివరించారు.

ప్రభుత్వ సహకారం కోసం విజ్ఞప్తి:

ఆటో నగర్ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ విషయంలో ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించాలని ఛాంబర్ కోరింది. దీనిపై త్వరలోనే జిల్లా కలెక్టర్ ప్రజా ప్రతినిధులను కలిసి మరోసారి వినతిపత్రం అందజేయనున్నట్లు తాతాజీ వెల్లడించారు

ఈ సమావేశంలో కేవలం ఆటో నగర్ మాత్రమే కాకుండా, స్థానిక వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న మున్సిపల్ పన్నులు, ఇతర వాణిజ్య సమస్యలపై కూడా చర్చించారు. ఛాంబర్ సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి అమలాపురం వాణిజ్య రంగాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ సభ్యులు, పలువురు ప్రముఖ వ్యాపారవేత్తలు, ఆటోమొబైల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.ం

## కమ్మిరెడ్డి పాలెం - వాడపాలెం రహదారి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**కొత్తపేట పెన్ పవర్ మార్చి 17;**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మంగళవారం కమ్మిరెడ్డి పాలెం – వాడపాలెం రహదారి అభివృద్ధి పనులను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాల్లో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. పనులు పక్కాగా, దీర్ఘకాలికంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రహదారి పూర్తైతే గ్రామాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడి ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. పనుల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## రామచంద్రపురంలో ఘనంగా నూకాలమ్మతల్లి జాతర మహోత్సవం.

- అమ్మవారిఆలయంలో తుమ్మలపల్లి రమేష్ ప్రత్యేక పూజలు.



**కిర్లంపూడి, పెన్ పవర్,మార్చి 17:**కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలో నూకాలమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. జగ్గంపేట నియోజకవర్గం జనసేనపార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ముందుగా ఈ జాతర ఉత్సవాలను తుమ్మలపల్లి రమేష్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ జాతర మహోత్సవంలో అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదములు స్వీకరించారు.

ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, నూకాలమ్మ అమ్మవారి కృపాకటాక్షంలు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆరోగ్యంతో, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అలాగే గ్రామాల్లో ఇలాంటి సాంప్రదాయ జాతరలు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని, యువత తమ సంప్రదాయాలను కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణ శేఖర్, ఎంపీటీసీ బండారు ప్రసాద్,వైస్ ప్రెసెడెంట్ రేవూరి శ్రీను, బండారు చక్రధర్,కామ్మయ్య, పాదాలరావు, గంధం శ్రీను,స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు,భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# గృహ అవసరాలకు గ్యాస్ అందించాలి





**అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 17:**ఇటీవల జరుగుతున్న యుదగద వాతావరణంలో గ్యాస్ సిలెండరు ల వినియోగంపై ఉన్నతాధికాతులు గ్యాస్ ఏజెన్సీ లను తణికీలు చేపట్టాయి. దీనిలో భాగంగా

అంబాజీపేట మాచవరం లో నిర్వహిస్తున్న భారత్ గ్యాస్ కంపెనీ ని మంగళవారం

అధికారులు, కోకోఫెడ్ ప్రతినిధులు గొఇదాముల నిల్వలను పరిశీలించారు. సివిల్ సప్లై ఎంఎస్ఓ లు పూర్ణిమ భారతి లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ విశ్వేశ్వరరావు కోకోఫెడ్ ప్రతినిధులు అరిగెల బలరామమూర్తి, జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించారు. . మాచవరం లో నిర్వహిస్తున్న గాస్ గోదాము లో ఉండవలసిన స్టాకు ఎల్పిజి సిలిండర్లు ఉండవలసినంత తూకం ఉన్నదా లేదా అని పరిశీలించారు. డెలివరీ బాయ్స్ వినియోగదారుల దగ్గర డబ్బులు రవాణాకు డబ్బులు వసూలు చేయరాదని నాలుగు కిలోమీటర్ల లోపు సిలెండర్ ఉచితంగా డెలివరీ చేయాలన్నారు అలాగే డొమెస్టిక్ సిలిండర్లు వ్యాపారస్తులకు ఎక్కువ రేట్లు కి అమ్మడం కూడదని నిబంధ్నలు ఉల్లంగిస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. తెలియజేశారు. యుద్ధ భయము పానిక్ బుకింగ్ చేస్తున్నారని దానివల్ల అవసరం లేకుండానే ఎక్కువ బుకింగ్ జరుగుతుందని దానివల్ల కూడా గ్యాస్ కొరతవస్తుందని ఏజెన్సీ నిర్వాహకులు అధికారులకు, కోకో ఫెడ్ ప్రతినిధులకు వివరించారు.

## గజ్జెనపూడిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు.

-కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు దాకారపు కృష్ణ.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్,మార్చి 17:**ప్రత్తిపాడు మండలం గజ్జెనపూడి గ్రామంలో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు కార్యక్రమం పశుసంవర్ధక శాఖ అధికారులు,టిడిపి నాయకులు దాకారపు కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా పాడి పశువులకు స్థానిక నాయకుల సమక్షంలో వ్యాధి సంరక్షణ దిశగా గాలికుంటు టీకాలు వేశారు.జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ గాలికుంటు నివారణ టీకాలను రైతులు తప్పనిసరిగా పాడి పశు వులకు వేయించాలని,పాడి రైతులకు సూచించారు.గాలికుంటు టీకాల యెక్క ప్రాముఖ్యతను వివరించారు.పాడి రైతులకు పశుసంవర్ధక శాఖ సూచనలతో తమ పాడిపశు లను సంరక్షించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ అంబేద్కర్, అసిస్టెంట్ డైరెక్టర్ బాలచంద్ర యోగేశ్వర్ , టిడిపి నాయకులు దాకారపు కృష్ణ, గ్రామ నాయకులు పశు వైద్య సిబ్బంది ,పాడి రైతులు, పాల్గొన్నారు

## ఆస్థి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ

50 శాతం రాయితీతో పన్నులు చెల్లించే అవకాశం



**మండపేట. పెన్ పవర్.మార్చ్ 17** :మున్సిపాలిటీ పరిధిలో చెల్లించాల్సిన ఇంటి పన్నులు, ఖాళీ స్థల పన్నుల బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం వడ్డీ మాఫీ సదుపాయం కల్పించినట్లు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ శాఖ ఆదేశాల మేరకు ఈ రాయితీ అమలులోకి వచ్చినట్లు ఆయన వెల్లడించారు. బకాయి పన్నులను ఒకేసారి చెల్లించే పన్ను దారులకు వడ్డీపై 50 శాతం మినహాయింపు వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక అవకాశం ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపారు. పట్టణ ప్రజలు గడువులోపు పన్నులు చెల్లించి ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పన్నుల చెల్లింపుల కోసం ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సెలవు రోజుల్లో కూడా ఈ కౌంటర్లు పనిచేస్తాయని తెలిపారు.

## గరుడ, సింహ వాహనాలపై స్వామివారి భక్తులకు దర్శనం

వాడపల్లి క్షేత్రంలో మూడవ రోజు అధ్యయనోత్సవాలు వైభవంగా





**ఆత్రేయపురం పెన్ పవర్, మార్చి 17:**కొనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్నఅధ్యయనోత్సవాలు మూడవ రోజు ఘనంగా కొనసాగాయి. మంగళవారం ఉదయం తీర్థ బిందె నదీజలాల సేకరణతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి సమేత లక్ష్మీదేవికి ప్రత్యేక హోమం నిర్వహించారు.నిత్యసేవాకాలంలో దివ్యప్రబంధ పారాయణం భక్తిశ్రద్ధలతో సాగింది. సాయంత్రం గ్రామోత్సవంలో భాగంగా పల్లకీ సేవ నిర్వహించి అనంతరం గరుడ, సింహ వాహనాలపై స్వామివారు విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి వాహన సేవలను దర్శించేందుకు భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తజన సందోహంతో కళకళలాడింది.

ఈ కార్యక్రమాలు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి.కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు సిస్ట కుటుంబరావు, వాడపల్లి సుందర శేషావతారం, అర్చకులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా ప్రారంభమైన కాండ్రకోట నూకాలమ్మ జాతర మహోత్సవాలు



**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 17 :** భక్తులపాలిట కొంగుబంగారంలా విరాజిల్లుతున్న కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 17 నుంచి మే నెల 3వ తేదీ వరకు సుమారు 45 రోజుల పాటు అమ్మవారి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారిణి ముమ్మన రాంబాబురెడ్డి తెలిపారు. జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అలాగే ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సిఐ పి. విజయ్ శంకర్ పర్యవేక్షణలో ఎస్సై వి. మౌనిక ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. జాతరకు భారీ సంఖ్యలో భక్తులు ఇతర జిల్లాల నుంచి తరలివచ్చిన నేపథ్యంలో వారి సౌకర్యార్థం పలు స్వచ్ఛంద సంస్థల సహాయ సహకారంతో చంటి పిల్లలకు పాలు, మజ్జిగ, మంచినీరు సరఫరా చేశారు. అలాగే అమ్మవారి జాతర సందర్భంగా కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు నిమ్మకాయల రంగనాగ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే జాతర మహోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, అధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు మ్యూజికల్ బ్యాండ్ ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అధికారులు కోరారు.

# పిల్లలకి ఎం బోదిస్తున్నారు ఎమ్మెల్యే దాట్ల ఆగ్రహం

**కాట్రేనికోన పెన్ పవర్ మార్చి 17:**కాట్రేనికోన జిల్లా ప్రజా పరిషత్ హై స్కూలు ను ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యన భోజనం సమయంలో వంటశాలను పరిశీలించి భోజనం రుచి చూసి సంతృప్తి వ్యకం చేసారు.

అనంతరం తరగతి గదిని సందర్శించి విద్యార్థిని విద్యార్థులతో ముచ్చటించారు. మన రాష్ట్ర విద్య శాఖ మంత్రి, ముఖ్య మంత్రి, పీఎం ఎవరని విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే అడగగా అయన ప్రశ్నలకు పిల్లలేవరు సమాధానాలు చెప్పకపోవడంతో తరగతి ఉపాధ్యాయున్ని పిలిచి పిల్లలకు మీరు ఏమి చెబుతున్నారు అని ప్రశ్నించారు. మధ్యాహ్నం భోజన పథకం పేరు ఏమిటని అడిగినా విద్యార్థులు కనీసం సమాధానం ఇవ్వకపోవడం తో మరింత అసంతృప్తి వ్యక్తం చేసారు. విద్యాశాఖ అధికారులపై మండిపడ్డారు. అనంతరం డొక్కా సీతమ్మ భోజనం పథకంలో నిర్వాహకులకు నాణ్యమైన ఆహారాన్ని అందించి పిల్లలను మన్నలను పొందాలని ఎమ్మెల్యే సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు విద్యార్థులకు నిర్వహిస్తున్న భోజన పథకంలో అవకతవకలో పాల్పడితే చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. అంతకుముందు సత్తెమ్మచెట్టు ప్రాథమిక పాఠశాలను పరిశీలించి అక్కడ బోజనము రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.



## పాఠశాలలకు దాతల సహకారం బడులకు సదుపాయాలు





**అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 17:**పేర్కొంటూరు ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం మరువరానిదని పేరాబత్తుల శేషగిరిరావు సోదరులు రూ. లక్ష రూఅయులు అందచేసారు. అలాగే దాతలు పేర్కొంది. మండలంలోని తొండవరం ఉన్నత పాఠసదాల ఆవరణలో టైల్ నిర్మాణం పనులకు దాతలు సహకారం అందవేసారు. అలాగే వెంపరాల భాను ప్రకాష్, సుబ్రహ్మణ్యం, రూ 50 వేలు, వెంపరాల యజ్ఞేశ్వరశాస్త్రి, చింతామణి రమేష్ లు రూ. 50 వేలు, చిట్టూరి కృష్ణమూర్తి కుమారుడు సూర్యనారాయణ రూ. 30 వేలు సహకారం అందించారు. దాతలను గ్రామస్తులు, ఉపాధ్యాయ లు అభిమదించారు.

## మంగళవారం అడ్డతీగల హాస్పిటల్ ని సందర్శించిన కాయకల్ప టీం.





**అడ్డతీగల ,పెన్ పవర్,మార్చి17**: మంగళవారం అడ్డతీగల హాస్పిటల్ ను కాయాకాల్ప టీం సందర్శించారు.హాస్పిటల్ ఉన్న శానిటేషన్ విధానం, పరిసరాల పారిశుధ్య పరిశుభ్రత గురించి,రోగులకు అందిస్తున్న సేవలు గురించి,హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ నుఅడిగితెలుసుకున్నారు.ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత,వార్డుల నిర్వహణ రోగులకు అందిస్తున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా టీం ప్రతి విషయంను పరిశీలించి, ప్రతి వార్డ్ తిరిగి, ఇక్కడ జరుగుతున్న సేవల పట్ల సంతృప్తి వక్తం చేసారు.ఈ కార్యక్రమంలో సింగంపల్లి. అరుణకుమారి,స్టేట్ పి.పి.ఎం కోఆర్డినేటర్ సబితా సుధా లలిత,డిస్టిక్ క్వాలిటీ ఆషురెన్స్ కన్సల్టెన్సీ డాక్టర్స్ మహేష్ రెడ్డి, హర్ష, అనూష, రేష్మ, మస్తాన్ వలి, హాస్పిటల్ స్టాఫ్, శానిటేషన్ సిబ్బంది , ఇతర సిబ్బంది పాల్గొన్నారు

## రవితేజ పార్థీవదేహాన్ని సందర్శించిన మాజీ మంత్రి వనిత.



**గోపాలపురం, పెన్ పవర్,ఫిబ్రవరి, 17.**గోపాలపురం పెద్దగూడెం కు చెందిన పిల్లి రవితేజ (22) బ్రెయిన్ స్ట్రోక్ తో ఆస్పత్రిలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తానేటి వనిత స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వెళ్లారు. రవితేజ పార్థీవ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. అలాగే నల్లజర్ల గ్రామానికి చెందిన రాయుడు శ్రీనివాస్ రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వైద్యం పొందుతున్న శ్రీనివాసులు సైతం మాజీ మంత్రి వనిత పరామర్శించారు. తొందరలోనే కోరుకుంటారని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమాలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు వెలగా శ్రీరామమూర్తి, కూసం రామ్మోహన్ రెడ్డి, సాలి వేణు, గెల్లా శ్రీను, కాకులపాటి శ్రీను తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బోల్లెద్దు పాలెం గ్రామంలో రైతన్న మీకోసం..



- రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం..
- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..

**కోరుకొండ, పెన్ పవర్, మార్చి 17:**కోరుకొండ మండలం బొల్లెదుపాలెం గ్రామంలో నిర్వహించిన 'రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు. మంగళవారం ఉదయం బుల్లెద్దుపాలెం గ్రామ రైతులతో కలిసి రైతన్న మీకోసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతుల అభ్యున్నతి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు.గత రెండు దఫాలుగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎక్కడా ఆటంకం లేకుండా పూర్తి చేశామని, విక్రయించిన 24 గంటల్లోపు రైతులకు నేరుగా నగదు జమ చేశామని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ ప్రతి రైతు ఖాతాలో 20,000 జమ చేయడం జరిగిందని, ఇది రైతులకు పెద్ద ఊరటనిస్తుందని చెప్పారు.సాగునీరు, యంత్ర పరికరాలు, విత్తనాలు, ఎరువులు మరియు పురుగుమందులపై ప్రభుత్వం భారీగా సబ్సిడీలు అందిస్తోందని వివరించారు. అలాగే, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకు మరియు సోలార్ బోర్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గత ఏడాది పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు ₹17,500 చొప్పున ఇన్పుట్ సబ్సిడీని నేరుగా అందించినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, కొరత ఉందనే పుకార్లను నమ్మవద్దని కోరారు.

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు అడ్డాల శ్రీనివాస్,కట్ట వెంకట్, కడిమ్ భార్గవ్, పులగం వీరబాబు, కట్ట పిలిస్, మంగం సూర్యప్రకాష్, గోకేటి పోసిబాబు,టీడీపీ నాయకులు తెలుగు రైతు అధ్యక్షులు పుప్పాల వెంకటరత్నం, బుర్ర రత్నజీ, గోకేటి సుబ్బారావు మరియు వ్యవసాయ శాఖ అధికారులు, కార్యకర్తలు మరియు రైతు సోదరులు పాల్గొన్నారు.

## ప్రజల సహకారం తో అభివృద్ధి సాధ్యం అయింది.

- పాలన ఆనందంగా సాగింది.
- ఒడిదుడుకులు ఉన్న రాజకీయం నేర్చుకున్న.
- పట్టణ ప్రజాందరికి కృతజ్ఞతలు.
- చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి.



**మండపేట. పెన్ పవర్. మార్చి.17 :** ప్రజల సహకారంతో మండపేట పట్టణ అభివృద్ధి సాధ్యమైందని పురపాలక సంఘం చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పేర్కొన్నారు. ఆమె అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ తనను ఎంతగానో ఆదరించారని పేర్కొన్నారు. తనకు రాజకీయ ఓనమాలు నేర్పిన వేగుళ్ళ పట్టాభి రామయ్య చౌదరి, పిల్లి సుభాష్ చంద్రబోస్ లను ఎన్నటికీ మర్చిపోనని పునర్ఘటించారు. రెడ్డి రాజబాబు తనకు సోదరుడి మాదిరి ఎన్నో సలహాలు సూచనలు ఇచ్చారన్నారు. ఈ పదవీకాలంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నానని అయినప్పటికీ నెగ్గుకు వచ్చానని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో తాను కౌన్సిల్ నిర్వహించారని చెప్పారు. ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు తనను సొంత బిడ్డల ఆదరించారని పేర్కొన్నారు. తనకు ఈ అవకాశాన్నిచ్చిన పట్టణ ప్రజలందరికీ కౌన్సిలర్లకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.తన హయాంలో కమిషనర్ గా పనిచేసిన వారంతా ఆర్ పేరుతో ఉన్నవారిని తెలిపారు. రామ్ కు, రాము, రంగారావు ఇలా వీరంతా ఆర్ లు అయితే తాను రాణి ఆర్ అని పేర్కొంటూ సభలో నవ్వులు పూయించారు.

## 'వజ్ర ప్రహార్'పై విద్యార్థులకు అవగాహన కల్పించిన అడ్డతీగల పోలీస్....



**అడ్డతీగల,పెన్ పవర్,మార్చి 17:** పోలవరం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'వజ్ర ప్రహార' ఆపరేషన్‌లో భాగంగా మంగళవారం అడ్డతీగల పోలీసులు గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు . ఇందులో భాగంగా అడ్డతీగల సీఐ బి. నరసింహమూర్తి మరియు ఎస్ఐ బి. వినోద్ తమ సిబ్బందితో కలిసి స్థానిక ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న నేరాలు మరియు చట్టాల పట్ల అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా సీఐ నరసింహమూర్తి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండటం అత్యవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, గంజాయి వంటి మత్తు పదార్థాలు వాడడం లేదా రవాణా చేసే వారిపై ఎన్. డి. పి. ఎస్ చట్టం కింద కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై వినోద్ మాట్లాడుతూ ప్రస్తుతం పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులతో ఆన్‌లైన్‌లో సంభాషణలు జరపవద్దని మరియు వ్యక్తిగత వివరాలను పంచుకోవద్దని సూచించారు. స్మార్ట్‌ఫోన్‌లను కేవలం చదువుకు సంబంధించిన విషయాల కోసం మాత్రమే పరిమితం చేయాలని కోరారు.

రహదారి భద్రత అంశంపై మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని ఎస్సై వినోద్ స్పష్టం చేశారు. క్రమశిక్షణతో కూడిన జీవనం ద్వారానే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ అవగాహన సదస్సులో సుమారు 150 మంది విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు మంచి సందేశాన్ని అందించిన పోలీస్ వారికి ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.